మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 124 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag. Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad.

బుధవారం 07 ఆగష్టు 2024

## రఫెల్ యుద్ధ విమానాల రక్షణలోభారత్‌కు హసీనా షేక్

**భారత గగనతలంలోకి రాగానే పర్యవేక్షణ- సురక్షితంగా ఆమె విమానం చేరేలా పూర్తి భద్రత**

**న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):** బంగ్లాదేశ్‌లో తీవ్ర ప్రతిఘటన ఎదుర్కొన్న షేక్ హసీనా రాజీనామా తర్వాత చోటుచేసుకున్న నాటకీయ పరిణామాల దరిమిలా భారత్ అప్రమత్తమైన విషయం విదితమే. గతకొన్ని రోజులుగా తలెత్తిన ఆందోళనకర పరిస్థితులను భారత్ ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తూ వచ్చింది. సోమవారం రాజీనామా అనంతరం షేక్ హసీనా భారత్‌కు వస్తున్నారని తెలుసుకున్న భద్రతా దళాలు గగనతలంపై నిఘా వేసి ఆమెకు రక్షణగా నిలిచాయి. బంగ్లాదేశ్ నుంచి వచ్చే విమానం భారత్‌లోకి సురక్షితంగా ప్రవేశించేలా చూడాలని నిర్ణయించాయి. షేక్ హసీనా విమానం గాజియాబాద్‌లోని హిండన్ ఎయిర్ బేస్‌లో సోమవారం సాయంత్రం 5:45 గంటలకు దిగింది. ఆమెను జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ ఆహ్వానించారు. అక్కడే దాదాపు గంటసేపు చర్చలు జరిపి, బంగ్లాదేశ్‌లో ప్రస్తుత పరిస్థితులు సహా భవిష్యత్ కార్యాచరణ గురించి అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. అనంతరం అక్కడి నుంచి వెళ్లి ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీకి పరిస్థితిని ఆయన వివరించారు.

# చైనాకు ప్రత్యామ్నాయంగా ఎదుగుదాం

## తెలంగాణకు కొత్త పారిశ్రామిక విధానం తీసుకొస్తాం

- రాష్ట్రంలో వ్యాపారాలకు సులభతరంగా నిర్ణయాలు
- హైదరాబాద్ నాలుగో నగరంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం
- అమెరికాలో రౌండ్ టేబుల్ సమావేశంలో పారిశ్రామికవేత్తలతో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, (ప్రజా మంటలు):** తెలంగాణలో పెట్టుబడులకు అపారమైన అవకాశాలున్నాయని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పరిశ్రమల అవసరాలు, అభిరుచికి అనుగుణంగా తమ ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందిస్తుందని ప్రకటించారు. అమెరికాలో ఉన్న వ్యాపార అవకాశాలన్నీ తెలంగాణలో ఉన్నాయని, చైనాకు ప్రత్యామ్నాయంగా ఎదగాలనేది తమ సంకల్పమని అన్నారు. తెలంగాణ అంటేనే వ్యాపారం.. తెలంగాణ అంటేనే పెట్టుబడులకు గమ్యస్థానంగా మారుస్తామని చెప్పారు. రాష్ట్రంలో చేపట్టిన ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులను ఈ సందర్భంగా సీఎం వివరించారు. త్వరలోనే హైదరాబాద్ నాలుగో నగరంగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని చెప్పారు. ఇది భారత దేశపు భవిష్యత్తుకు చిరునామాగా నిలుస్తుందని అభిప్రాయ పడ్డారు. దేశంలోనే జీరో కార్బన్ సిటీ ఇక్కడ ఏర్పడతుందని అన్నారు. ఫ్యూచర్ సిటీలో అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్తో పాటు, మెడికల్, టూరిజం, స్పోర్ట్స్, సాఫ్ట్‌వేర్, ఫార్మా విలేజ్లను అభివృద్ధి చేస్తామన్నారు. ఈ ఫ్యూచర్ సిటీ రాష్ట్ర అభివృద్ధితో పాటు పరిశ్రమలకు సిరుల పంట పండిస్తుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో వ్యాపారాలు, పెట్టుబడుల విస్తరణను సులభతరం చేస్తామని సీఎం ప్రకటించారు. అటువంటి సరికొత్త ఆలోచనలతోనే కొత్త పారిశ్రామిక విధానాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. సోమవారం న్యూయార్క్‌లోని కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వర్కింగ్ లంచ్ అనంతరం ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలతో రౌండ్‌టేబుల్ సమావేశమయ్యారు. ఫార్మా, ఐటీ, టెక్నాలజీ, ఈవీ, బయోటెక్, షిప్పింగ్ రంగాల్లో పేరొందిన కంపెనీలకు ప్రాతినిధ్యం వహిస్తున్నఛైర్‌పర్సన్‌లు, సీఈవోలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్తో పాటు తెలంగాణ రాష్ట్రాన్ని పారిశ్రామిక క్లస్టర్లుగా విభజించి, అభివృద్ధి చేసేందుకు రూపొందించిన భవిష్యత్తు ప్రణాళికలు, తెలంగాణ చరిత్రపై ముఖ్యమంత్రి ప్రజంటేషన్ ఇచ్చారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. తన మనసులోని మాటలతో పాటు తమ ప్రభుత్వం ఏం కోరుకుంటుందో.. తన రాష్ట్ర ప్రజల ఆకాంక్షలేమిటో వెల్లడిస్తానంటూ అందరినీ ఉత్సాహపరిచారు. ముఖ్యమంత్రి హోదాలో ఇది తన మొదటి అమెరికా పర్యటన అని.. ఇక్కడి నుంచి వీలైనన్ని పెట్టుబడులు తెలంగాణకు తీసుకెళ్లాలన్నదే తన లక్ష్యమని ప్రకటించారు. పెట్టుబడుల గమ్యస్థానంగా దేశంలోనే అందరినీ ఆకర్షిస్తున్న తెలంగాణకు ఉన్న అనుకూలతలన్నింటినీ ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వివరించారు. ఇప్పటికే సాఫ్ట్‌వేర్, లైఫ్-సైన్స్, ఫార్మా రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా నిలిచిందని, ఏరోస్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్ తదితర రంగాలలో బలమైన పునాదులు వేసుకుందని చెప్పారు. కోవిడ్ను అధిగమించేందుకు మిలియన్ల కొద్దీ వ్యాక్సిన్‌లను తయారు చేసి ప్రపంచానికి సాయం చేసిందని అన్నారు.

## ప్రభుత్వ సలహాదారులుగా నోబెల్ అవార్డు గ్రహీత మహ్మద్ యూనుస్

**దేశం కోసం ఎలాంటి బాధ్యతలైనా నిర్వర్తిస్తా..**

**ప్రభుత్వాన్ని నడిపించేందుకు సైతం సిద్ధమని వెల్లడి**



**ఢాకా (ప్రజా మంటలు):** బంగ్లాదేశ్‌లో కొత్తగా ఏర్పడబోయే మధ్యంతర ప్రభుత్వానికి ప్రధాన సలహాదారుగా ప్రముఖ ఆర్థికవేత్త, నోబెల్ అవార్డు గ్రహీత డాక్టర్ మహ్మద్ యూనుస్ ఎంపిక దాదాపు ఖాయంగా తెలుస్తోంది. ముహమ్మద్ యూనస్ పేరును విద్యార్థి సంఘాలు ప్రతిపాదించాయి. ఆయనను చీఫ్ అడ్వైజర్‌గా నియమించాలని విద్యార్థి సంఘాల వేదిక 'యాంటీ డిస్క్రిమినేషన్ స్టూడెంట్ మూవ్‌మెంట్' డిమాండ్ చేసింది. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమాన్ని నడిపించినవారిలో ఒకరైన నహీద్ ఇస్లాం సోషల్ మీడియాలో ఓ వీడియో పోస్ట్ పెట్టారు. తమ ప్రతిపాదనకు డాక్టర్ యూనుస్ అంగీకరించారని, దేశ భవిష్యత్తు కోసం బాధ్యతలు చేపట్టాలని నిర్ణయించుకున్నారని తెలిపారు.

1940 జూన్ 28న చిట్టగాంగ్‌లో యూనస్ జన్మించారు. ఆర్థికశాస్త్రంలో 2006లో నోబెల్ అవార్డును అందుకుని.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అత్యంత బలోపేతం చేశారు. మైక్రో క్రెడిట్, మైక్రో ఫైనాన్స్ రంగంపై గట్టి పట్టు సాధించారు. బ్యాంకింగ్ సేవలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరింపజేయడంలో డాక్టర్ మహ్మద్ యూనస్ కీలకంగా పని చేశారు. అలాగే, 2009లో యునైటెడ్ స్టేట్స్ ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్.. 2010లో కాంగ్రెషనల్ గోల్డ్ మెడల్‌తో సహా పలు ప్రతిష్టాత్మక అవార్డులను నోబెల్ అవార్డు గ్రహీత డాక్టర్ యూనస్ అందుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా సామాజిక కార్యకలాపాలను చేపట్టడానికి 2011లో యూనస్ సోషల్ బిజినెస్- గ్లోబల్ ఇనిషియేటివ్స్ అనే సంస్థను స్థాపించారు. 1969లో ఆర్థిక శాస్త్రంలో పీహెచ్‌డీ పూర్తి చేసిన యూనస్ డాక్టరేట్ అందుకున్నారు. వాండర్‌బిల్ట్ యూనివర్సిటీలో చదువుకోడానికి ఫుల్‌బ్రైట్ స్కాలర్‌షిప్‌ను సైతం పొందారు. విద్యాభ్యాసం ముగిసి తర్వాత మిడిల్ టెన్నెస్సీ స్టేట్ విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా వర్క్ చేశారు. అలాగే, చిట్టగాంగ్ యూనివర్శిటీ ఎకనమిక్స్ హెడ్‌గా కూడా బాధ్యతలను నిర్వర్తించారు.

### పొలిట్రిక్స్

రానున్నది 'గేమ్'చేంజ్
రాజకీయంలో బ్రదర్,
'వృద్ధ' తరానికిక స్వస్తి
'యంగ్'తరంగ్ కే ఖద్దర్ !

తలపండిన వారేగా...
సగానికి పైగా 'చట్టసభ'ల్లో
సమూల మార్పు కోరకై
తప్పదు మరి పార్టీల్లో !

- న్యాలకంటి నారాయణ
9346200066

# నాటి నిబంధనను జీవో 33లో కొనసాగించాం..!

## ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపుపై మంత్రి రాజనరసింహ క్లారిటీ



**హైదరాబాద్, (ప్రజా మంటలు):** వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపు విషయంలో ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జీవో 33పై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ స్పష్టత ఇచ్చారు. జీవో 33తో స్థానిక విద్యార్థులు నష్టపోతారంటూ మాజీ మంత్రి కేటీఆర్ 'ఎక్స్' వేదికగా చేసిన వ్యాఖ్యలకు మంత్రి స్పందించారు. ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపునకు సంబంధి 2017 జులై 5న అప్పటి భారాస ప్రభుత్వం జారీ చేసిన జీవో 114ని ప్రస్తావించిన మంత్రి.. ఆ జీవోలోని 9 నుంచి 12 తరగతి వరకు చదివిన విద్యార్థులను స్థానికులుగా పరిగణిస్తూ చేసిన నిబంధనను జీవో 33లో కొనసాగించామని పేర్కొన్నారు. అయితే, అదే జీవోలోని 6 నుంచి 12 వరకు కనీసం నాలుగేళ్లు విద్యార్థులు చదివిన ప్రాంతానికి స్థానికతను వర్తింపజేయాలన్న నిబంధనను కొనసాగించలేమని మంత్రి స్పష్టం చేశారు. జీవో 114లోని ఈ నిబంధన ప్రకారం విద్యార్థి నాలుగేళ్లు తెలంగాణలో.. మిగిలిన మూడేళ్లు ఏపీలో చదివితే వారిని తెలంగాణ స్థానికులుగా పరిగణించారని గుర్తు చేశారు. అయితే ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం జూన్ 2తో పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో నిబంధనను కొనసాగించలేమని మంత్రి పేర్కొన్నారు.



## బంగ్లా నుంచి భారతీయుల తరలింపు అవసరం లేదు

**కేంద్ర ప్రభుత్వం ప్రకటన**

**మానవత్వ చర్యలో భాగంగానే హసీనాకు ఆశ్రయం**

**న్యూఢిల్లీ (ప్రజా మంటలు):** 'భారతీయలను తరలించేంతగా బంగ్లాదేశ్‌లోని పరిస్థితులు ప్రమాదకరంగా లేవు. కానీ అక్కడి పరిస్థితుల్ని అత్యంత అప్రమత్తతతో గమనిస్తున్నాం' అని కేంద్ర మంత్రి ఎస్ జైశంకర్ తెలిపారు. బంగ్లాదేశ్‌లో 12-13 వేల మంది భారతీయులున్నారని, పొరుగుదేశంలో ఉన్న మన ప్రజల భద్రత విషయమై అక్కడి ఆర్మీతో టచ్‌లో ఉన్నాం అని మంత్రి వెల్లడించారు. అలాగే ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనాతో భారత ప్రభుత్వం మాట్లాడిందన్నారు. మానవత్వ చర్యలో భాగంగానే ఆమెకు భారత్‌లో ఆశ్రయం ఇచ్చామని చెప్పారు. భవిష్యత్‌పై నిర్ణయం తీసుకోవడానికి ఆమెకు కొంత సమయం కావాలని భావిస్తున్నామని తెలిపారు. బంగ్లాదేశ్‌లో నెలకొన్న రాజకీయ అస్థిర పరిస్థితులను కేంద్రం నిశితంగా గమనిస్తోంది. ఈ క్రమంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. అక్కడి పరిణామాల గురించి విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ పార్టీల నేతలకు వివరించారు. భారతీయుల్ని తరలించేంత ప్రమాదకరంగా అక్కడి పరిస్థితులు లేవని వెల్లడించారు. ఈ సమావేశంలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. షేక్ హసీనాను గద్దె దింపడం వెనక విదేశీ కుట్ర ఏమైనా ఉందా..? అని ప్రశ్నించారు. దీనిపై ఇప్పుడే ఒక అంచనాకు రావడం తొందరపాటు అవుతుందని మంత్రి బదులిచ్చారు. "అయితే, పాకిస్థాన్ దౌత్యవేత్త ఒకరు ఆందోళనలకు మద్దతుగా తన ప్రొఫైల్ పిక్‌ను మార్చుకున్నారు" అని సమాధానం ఇవ్వడం గమనార్హం.

### ప్రజా నాడి




## వీరభద్ర నక్షత్ర మాల దీక్ష తీసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**నేటి నుంచి 27 రోజులపాటు వీరభద్రుడి దీక్షలో మంత్రి**

**దేవుడి మహిమ మీద విశ్వాసం ఉంది**

**కోరుకున్న మొక్కు నెరవేర్చుకున్న మంత్రి పొన్నం**

**పెద్ద ఎత్తున హాజరైన కాంగ్రెస్ కార్యకర్తలు**



**భీమదేవరపల్లిఆగస్టు 6 (ప్రజామంటల ప్రతినిధి కాశిరెడ్డి ఆదిరెడ్డి) :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలో శ్రీ వీరభద్ర దేవాలయంలో రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ వీరభద్రుడి నక్షత్ర దీక్ష మాలను స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికలలో భాగంగా పిసిసి అధ్యక్షుని హోదాలో ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి తో పాటు, మంత్రి పొన్నం ప్రభాకర్ వీరభద్రుడుని దర్శించుకున్నారు. ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వీరభద్ర నక్షత్ర దీక్ష చేపడతానని పొన్నం మొక్కుకున్నారు. వారి కోరిక నెరవేరడంతో పాటు, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకురావడమే కాకుండా, స్వామి ఆశీర్వాదంతో మంత్రి పదవి కూడా పొన్నం ను వరించింది.

**మొక్కు తీర్చుకున్న మంత్రి**

అసెంబ్లీ ఎలక్షన్స్ కి ముందు ప్రచారంలో భాగంగా భీమదేవరపల్లి మండలంలో పర్యటించిన సందర్భంలో మొదటగా కొత్తకొండ వీరభద్ర స్వామిని దర్శించుకున్నారు. ఆ సమయంలో తనకు టికెట్ తో పాటు, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వీరభద్ర నక్షత్ర దీక్షను తీసుకుంటానని మొక్కుకున్నారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, పొన్నం మంత్రి కావడం చకా చకా జరిగిపోయాయి. తాను కోరుకున్న కోరికలు నెరవేరడంతో, శ్రావణమాసంలో వీరభద్ర దీక్ష తీసుకొని మాల వేసుకున్నారు.

**శ్రీ వీరభద్ర దీక్ష విశిష్టత**

శ్రావణ మాసంలో ప్రతి సంవత్సరం భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర ఆలయంలో 27 రోజులపాటు నక్షత్రమాల ఉంటుంది. అత్యంత ప్రాచుర్యం కలిగిన వీరభద్రుడి మాల వేసుకోవడం సకల సౌభాగ్యాలకు మంచిదని నక్షత్ర దీక్ష వ్యవస్థాపక గురుస్వామి, ఆలయ అర్చకులు మొగిలిపాలెం రాంబాబు అన్నారు.

**ఈ సందర్భంగా మంత్రి పున్నం ప్రభాకర్ మాట్లాడుతూ...**

ఈ దీక్ష స్వప్రయోజనాల కొరకు కాకుండా రాష్ట్ర ప్రజలు, నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలతో పసిడి సిరులు కురువాలని అన్నారు. నియోజకవర్గ

మిగతా 2లో..




తెలంగాణ సిద్ధాంత కర్త ప్రో. జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోకల జమున, పలువురు బీఆర్ఎస్ నేతలు.



## ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు

మహాదేవపూర్ ఆగస్ట్ 06 (ప్రజామంటలు):

మండల కేంద్రంలో పిఏసిఎస్ చైర్మన్ చల్ల తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు కోపరేటివ్ సొసైటీ బ్యాంక్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు అనంతరం జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ....ప్రత్యేక రాష్ట్ర సాధనే ధ్యేయంగా జీవితాంతం గడిపిన ప్రొఫెసర్ జయశంకర్ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తామని చల్ల తిరుపతి రెడ్డి అన్నారు బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోట రాజబాపు మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రాన్ని ఆంధ్ర రాష్ట్రంలో విలీనం చేయడాన్ని జయశంకర్ వ్యతిరేకించారని గుర్తు చేశారు. ఏపీలో విలీనంతో జరిగిన అన్యాయాన్ని ఎప్పటికప్పుడు వివరిస్తూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని ఆరు దశాబ్దాలు సజీవంగా ఉంచిన ఘనత ఆయనదేనని కొనియాడారు ఆయన ఆశయ సాధనకు మేము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ చీర్ల తిరుపతి రెడ్డి, దాసరి సమ్మయ్య,బ్లాక్ , మాజీ మండల అద్యక్షులు చిన్నన్న, సిఈఓ రాజాబాపు తదితరులు పాల్గోన్నారు.




## తెలంగాణ మహనీయుడు ప్రొ. జయశంకర్ గాంధీ సూపరింటెండెంట్ ప్రొ. రాజకుమారి

సికింద్రాబాద్ ఆగస్ట్ 06 (ప్రజామంటలు):

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా మంగళవారం గాంధీ ఆసుపత్రి వైద్యాధికారులు ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా మెయిన్ బిల్డింగ్ ఆవరణలో ఉన్న ప్రొ.జయశంకర్ విగ్రహం వద్ద గాంధీ సూపరింటెండెంట్ ప్రొ. రాజకుమారి, ఆర్ఎంఓ%-%1 డా. శేషాద్రి లు జయశంకర్ సర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఆయన తెలంగాణ రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



## వివిధ పార్టీల ప్రతినిధులతో సమీక్ష

### కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగామ ఆగస్ట్ 06 (ప్రజామంటలు):

ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు చెందిన 14-భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)లపై ఎలాంటి కేసులు లేనందున, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రిలీజ్ చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయం లోని మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, (రెవెన్యూ) రోహిత్ సింగ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జనగామ అసెంబ్లీ సెగ్మెంట్ 14-భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్నందున, ఎన్నికలు నిర్వహించిన ఈవీఎంలపై ఎలాంటి కోర్టు కేసులు లేనందున, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆ ఈవీఎంలను తదుపరి రాబోయే ఎన్నికల్లో వినియోగించుకునేందుకు రిలీజ్ చేయడం జరిగిందని తెలిపారు. అదే విధంగా ఘనపూర్ (స్టేషన్), పాలకుర్తి అసెంబ్లీ సెగ్మెంట్లు 15-వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్నందున, పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించిన ఆ ఈవీఎంలపై కోర్టు కేసు ఉండడంతో పరిష్కారం అనంతరం ఈవీఎంలను రిలీజ్ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బి. భాస్కర్, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి ఆర్. రవి, భాజాపా పార్టీ ప్రతినిధి విజయ్ భాస్కర్, బీఎస్పీ పార్టీ ప్రతినిధి ఎం. చంద్రశేఖర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కిష్టయ్య, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జనగామ పోలీస్ స్టేషన్ లో న్యాయవాద దంపతులపై పోలీసుల దాడి

### తక్షణమే సిఐ, ఎస్ఐ, లను సస్పెండ్ చేయాలని రాస్తారోకో

జనగామ ఆగస్ట్ 06 (ప్రజామంటలు):

తన క్లయింట్ కేసు విషయంలో నిన్న స్థానిక సి.ఐ రఘుపతినీ కలవడానికి జనగామ పోలిష్ స్టేషన్ కు వెళ్లి మేము న్యాయవాదులమని చెప్పినప్పటికి కేసు విషయంలో నీకేం పని అంటూ న్యాయవాద దంపతులు గద్దల అమృత రావు-కవితలపై ఆగ్రహంతో ఉగిపోతూ తన పోలీస్ సిబ్బందితో కలిసి పోలీస్ స్టేషన్ లోనే ఆకరణంగా చేయి చేసుకొని దాడి చేశారు. ఈసంఘటనను ఖండిస్తూ మంగళవారం జనగామ జిల్లా బార్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ ఎనగందుల చంద్రరుషి ఆధ్వర్యంలో స్థానిక గెస్ట్ హౌస్ చౌరస్తాలో న్యాయవాదులు విధులు బహిష్కరించి తోటి నాయవాదులపై జరిగిన ఘటనకు నిరసిస్తూ పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎండి సాధిక్ అలీ, శ్రీరాం శ్రీనివాస్, కూరెల్లి శ్రీనివాస్ రెడ్డి, హరిప్రసాద్ యాదవ్, పానుగంటి శ్రీనివాస్, నక్క సిద్దులు, దయాకర్ రెడ్డి, కిషన్ గౌడ్, నాగరాజు శర్మ, మైదర్రావు, బిట్ల వెంకట్ నర్సయ్య, శంకర్, పసునూరి మురళి, ఇర్రి అశోక్, అనుగంటి లక్ష్మి నర్సింహా స్వామీ, మన్నే సత్తయ్య, చాట్ల నర్సింగరావు, బండారి నర్సింగ రావు, ఉడుత ఉపేందర్ యాదవ్, ఆకుల శ్రీనివాస్, చెరుకు



చంద్రశేఖర్, రాగళ్ల శ్రీహరి, అల్లే బాలరాజు, గొంగిడి నర్సింహులు, మేకల స్వప్న, బిర్రు స్వప్న, భవాని, రాధిక తోటి న్యాయవాదులు పాల్గొన్నారు.

## అనాధాశ్రమానికి నిత్యవసర సరుకులు వితరణ

జనగామ అగస్టు 6 (ప్రజామంటలు):



హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం దాతల సహకారంతో మోతీ నగర్ లో ఉండే శ్రీ ఆదర్శ చిల్డ్రన్ హోమ్ అనాధాశ్రమానికి నిత్యవసర సరుకులు పంపిణీ చేసినట్లు ట్రస్ట్ అధ్యక్షులు మూడే రవి నాయక్ తెలిపారు.రవి నాయక్ మాట్లాడుతూ దాత కాసు పూర్ణ కళ పుట్టినరోజు సందర్భంగా అనాధ ఆశ్రమంలో జరుపుకొని 10వేల రూపాయల విలువ గల నిత్యవసర సరుకులను తన చేతుల మీదుగా అందజేశారు. పూర్ణ కళ మాట్లాడుతూ దుబారా ఖర్చులు తగ్గించి ఒక మంచి పని కోసం నా వంతు బాధ్యతగా అనాధ ఆశ్రమానికి సందర్శించి ఈ రోజు పిల్లలకి నిత్యవసర సరుకులు, బియ్యం 75కేజీ, కందిపప్పు 5కేజీ, మినప్పప్పు 3 కేజీ, చక్కెర 5కేజీ, మంచి నూనె 10 ఇడ్లీ రవ్వ 3కేజీ, చింతపండు 2కేజీ కారం1కేజీ, పసుపు, ధనియాల పొడి, సబ్బులు అందజేస్తున్నందుకు చాలా ఆనందంగా భావిస్తున్నానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ కాసు శ్రీనివాస్, హారిక, కుళ్ళయి నాయక్ లు పాల్గొన్నారు.

## విస్డం హైస్కూల్లో ప్రత్యేక వ్యక్తిత్వ వికాస తరగతుల నిర్వహణ

రాయికల్ ఆగస్టు 06 (ప్రజామంటలు):

పట్టణంలోని విస్డం హైస్కూల్లో విద్యార్థుల మానసిక, వ్యక్తిత్వ వికాస పరిణితి కోసం విశ్వతేజాస్ ట్రైనింగ్ మరియు కౌన్సిలింగ్ సర్వీసెస్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించడం జరిగింది. సమాజంలో మారుతున్న పోకడలకు, విద్యా వ్యవస్థలో అనునిత్యం జరుగుతున్న మార్పులకి, పిల్లల్లో చోటుచేసుకుంటున్న టెక్నాలజీ వ్యసనం లాంటి వాటినుండి మేలుకొలుపడానికి విస్డం హై స్కూల్ కరస్పాండెంట్ డా. ఎద్దండి ముత్యంపు రాజు రెడ్డి శ్రీకారం చుట్టారు. విశ్వతేజాస్ ఫౌండర్ ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు లైఫ్ కోచ్ తిరునగరి శ్రీహరి “విజన్ టు విక్టరీ” అనే అంశంపై మాట్లాడుతూ విద్యార్థులు పోటీ ప్రపంచంలో తట్టుకోవాలంటే సృజనాత్మకత,వారు చేసే పనులలో అనుశాసనం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం అత్యవసరమని కథల ద్వారా కళ్ళకు కట్టినట్లు వివరించారు. మరో




వక్త, తైక్వాండో శిక్షకులు నరహరి నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు ఏర్పరచుకునే లక్ష్యం స్పష్టంగా ఉండాలని అనుక్షణం లక్ష్యాన్ని స్మరిస్తూ సాధన చేయాలని తల్లి తండ్రి గురువులకు గౌరవం ఇవ్వాలని మనకు సహాయం చేసే వారిపట్ల నిత్యం కృతజ్ఞత తో మెదలాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎద్దండి నివేదిత రెడ్డి, విశ్వతేజస్ డైరెక్టర్ ప్రసన్న, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన మార్కెట్ కార్యదర్శి మల్లేశంకు సహకరిస్తాం

### ఒక్కరోజు మార్కెట్ ఆగకుండా నడిపిన చరిత్ర రెడ్డి నాయక్ ది

### జమ్మికుంట అడ్తిదారుల సంఘం అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వరరావు

జమ్మికుంట ఆగస్ట్ 06 (ప్రజామంటలు):



జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిగా బదిలీపై వచ్చిన ఆర్. మల్లేశంకు సంపూర్ణంగా సహకరిస్తామని జమ్మికుంట అడ్తిదారుల సంఘం, దాడ్వాయిల సంఘం అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం జమ్మికుంట పట్టణంలోని అడ్తిదారుల సంఘం భవనంలో ఎర్రబెల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో బదిలీపై వెళ్తున్న గుగులోతు రెడ్యా నాయక్ కు వీడ్కోలు పలుకుతూ.. నూతన కార్యదర్శి మల్లేశంకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ సెక్రటరీగా సమస్తవంతంగా రెడ్యానాయక్ పని చేశారని తెలిపారు. సుమారు ఆరేండ్ల కాలంలో ఒక్కరోజు కూడా మార్కెట్ ఆగకుండా నడిపిన చరిత్ర అని కొనియాడారు. సుమారు 40 నుంచి 45 మండలాల రైతులు, వ్యాపారస్తులు, అడ్తిదారులకు ఇలాంటి ఇబ్బందులు లేకుండా అందరినీ ఏకతాటిపై ముందుకు తీసుకెళ్లిన ఘనత రెడ్యానాయక్ కు దక్కిందని పేర్కొన్నారు. నూతనంగా బదిలీపై వచ్చిన మల్లేశంకు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని, ఆయన కూడా చక్కటి సేవలు అందించాలని రాజేశ్వరరావు కోరారు. కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లుల సంఘం మాజీ అధ్యక్షుడు బచ్చు భాస్కర్, జమ్మికుంట రైస్ మిల్లుల సంఘం అధ్యక్షుడు జి రాజమౌళి, సీనియర్ నాయకుడు మనోహర్ రావు, జమ్మికుంట మాజీ సర్పంచ్ పొనగంటి మల్లయ్య, ప్రసాద్, ముక్క జితేందర్, ముక్క నారాయణ, బాప్ శెట్టి, ముక్క శ్రీను, వ్యాపారస్తులు, గుమస్తాలు తదితరులు పాల్గొన్నారు.

## పదవి విరమణ పొందుతున్న హెూం గార్డ్ సాగర్ కి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు

జగిత్యాల ఆగస్ట్ 06 (ప్రజామంటలు):

పోలీస్ శాఖలో హెూంగార్డ్ గా గత 26 సంవత్సరాలుగా విధులు నిర్వహించి పదవి విరమణ పొందుతున్న సాగర్ ను మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ భీమ్ రావు పూలమాల వేసి శాలువలతో ఘనంగా సన్మానించారు. పోలీస్ ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలను పొందినారు అన్నారు. సుధీర్ఘకాంగా విధులు నిర్వహించి పదవీవిరమణ చేసిన సేవను మరువమని, పదవీవిరమణ చేసిన మీరు కుటుంబంలో ఎలాంటి సమస్య వచ్చిన తనను సంప్రదించ వచ్చని పోలీసు రిటైర్ మెంట్ కేవలం తన వృత్తికే, కాని తన వ్యక్తిత్వానికి కాదు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ. లు, రామకృష్ణ, వేణు, ఎస్సైలు రవీందర్, సుమన్, వినోద్ రెడ్డి మరియు సిబ్బంది పాల్గొన్నారు.





## భూపతిపూర్ హైస్కూల్లో జయశంకర్ జయంతోత్సవ కార్యక్రమం

రాయికల్ ఆగస్ట్ 06 (ప్రజామంటలు):

మండలంలోని భూపతిపూర్ హై స్కూల్ నందు జయశంకర్ జయంతోత్సవం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయురాలు ఉన్నంతల వెంకట రమణి ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ....సమానత్వం కోసం తెలంగాణ పరాష్టమని తెలిపిన వ్యక్తి, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లక్ష్యంగా, స్వరాష్ట్ర సాధన కోసం తన చివరి శ్వాస వరకు పోరాడిన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో బొల్లె చిన్నయ్య, తోట శంకరయ్య, సిరిపురం మహేష్, ఎండి సహబాజ్ హుస్సేన్, పులి శెట్టి సంజయ్ కుమార్, ఖమరుద్దీన్, తాటిపెల్లి వేణు గోపాల్, కోల రాజగోపాల్, కూరగాయల సురేష్, గాలి పుష్పలత, పల్లెం భవాని, పోచంపల్లి సరోజన, చింత శైలజ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## వ్యాసకర్తలకు వినతి

రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై వ్యాసాలు పంపేవారు మీ వ్యాసాలను వీలైనత క్లుప్తంగా, వివరణాత్మకంగా, 350-400 ల పదాలకు పరిమితం అయి ఉండేలా చూడండి. పెద్ద వ్యాసాలను పరిశీలించనడం సాధ్యం కాకపోవచ్చని గ్రహించగలరు. వర్డ్ డాక్యుమెంట్, లేదా ఓపెన్ ఫైల్ లో, ఈ మెయిల్ కు మాత్రమే పంపగలరు.

mantalukathalu@gmail.com

-ఎడిటర్

# చేనేతకు చేయూత అవసరం



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

### ఆగస్టు 7...జాతీయ చేనేత దినోత్సవం

సనాతన సాంప్రదాయాలకు, ప్రాచీన సంస్కృతికి అనాదిగా ఆలవాలమైన భారత దేశంతో చేనేత విడదీయలేని బంధం అనుబంధం, సంబంధం కలిగి ఉంది. భారతీయత సాంస్కృతిక కళలలో ముఖ్యమైనదై, వారసత్వానికి ప్రతీక అయిన చేనేత కళ దేశానికి గర్వకారణం.

జాతీయ చేనేత దినోత్సవం ఆగష్టు 7న దేశవ్యాప్తంగా ప్రతి ఏట నిర్వహిస్తారు. భారత స్వాతంత్ర్యోద్యమంలో ప్రధాన భూమిక పోషించి, స్వాతంత్ర్య సమపార్జనకు ఒక సాధనంగా నిలిచింది చేనేత. గాంధీజీ కూడా రాట్నంపై నూలు వడకడానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. అంతటి ప్రాధాన్యత కలిగిన చేనేత రంగానికి ఒకరోజు ఉండాలన్న ఉద్దేశ్యంతో జాతీయ చేనేత దినోత్సవంను ఏర్పాటు చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్రానికి చెందిన యర్రమాద వెంకన్న నేత చేనేత దినోత్సవానికి సరైన తేదీ కోసం అధ్యయనం చేశారు. భారత స్వాతంత్ర్య ఉద్యమం జరుగుతున్న సమయంలో విదేశీ వస్త్రాలను బహిష్కరించాలన్న లక్ష్యంతో స్వదేశీ ఉద్యమం వచ్చింది. మొదటిసారిగా 1905లో బెంగాల్ రాష్ట్ర రాజధాని కలకత్తాలోని టౌన్‌హాల్‌లో 1905 ఆగస్టు 7న భారీ సమావేశం నిర్వహించి విదేశీ వస్త్రాలను బహిష్కరించడంతో పాటూ దేశీయోత్పత్తుల పునరుద్ధరణకు పిలుపునిచ్చారు. అలా విదేశి వస్తు బహిష్కరణలో కీలకపాత్ర వహించిన ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా చేయాలని నిర్ణయించారు.

భారతీయ చేనేతకు వేల సంవత్సరాల చరిత్ర ఉంది, ప్రపంచంలో అతి కొద్ది దేశాలకు మాత్రమే ఈ ఘనత ఉంది. పురాతన కాలంనుంచి భారతీయ చేనేత వస్త్రాలు ప్రపంచమంతా ఎగుమతులు చేయబడేవి. భారతదేశంలో అతి ప్రాచీన పరిశ్రమ ఇది. ఒకప్పుడు దేశానికి పేరు, డబ్బు తెచ్చిన, వందల ఏళ్ల క్రితం నుంచీ విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించిన ఘనత ఈ పరిశ్రమకు ఉంది. శాతవాహనుల కాలంలో ఇక్కడి వస్త్రాలు యూరప్‌కి ఎగుమతి అయిన ఆధారా లున్నాయి. రెండువేల సంవత్సరాల క్రితం %-%హంస' డిజైన్లతో ఉన్న భారతీయ వస్త్రాలు ఈజిప్టు కైరో నగరంలో లభ్యమయాయి.
కాలక్రమేణా బ్రిటిష్ పాలనలో, ఆ తరువాత పారిశ్రామికీకరణలో ఈ రంగం భారీగా దెబ్బతిన్నది. అగ్గిపెట్టెలో పట్టే మస్లిన్ చీరలను నేసిన ఘనచరిత్ర ఉన్న దేశం మనది. తరతరాలుగా చేనేత కుటుంబాలలో వారసత్వ కళగా ఇది కొనసాగుతోంది. కొన్ని కుటుంబ సభ్యులంతా కలిసి మగ్గాల మీద బట్ట నేస్తుండడం మనకు కనిపిస్తుంది. ప్రముఖ చేనేత కేంద్రాలలోని గ్రామాలలో, మొత్తంగా నేతపనిలో నిమగ్నమై ఉంటారు. ఉపాధి విషయంలో వ్యవసాయం తరువాత చేనేతది రెండవ స్థానం, కుటీర పరిశ్రమల కింద కోట్లాది మందికి ఉపాధి కల్పిస్తున్నది చేనేత పరిశ్రమ. ప్రత్యక్షంగా, పరోక్షంగా 70లక్షల మందికి పైగా ఈ పరిశ్రమ ఉపాధి కల్పిస్తోంది, వీరు మగ్గాల మీద నేసిన వస్త్రాలు, దేశం మొత్తం వస్త్రాల ఉత్పత్తిలో 20% పైగా ఉంటాయి. ప్రపంచ చేనేత వస్త్రాలలో 90% పైగా భారత దేశంలో నేయబడతాయి. భారత దేశంలో దాదాపు 150 చేనేత కేంద్రాలు ఉన్నాయని అంచనా. నూలు, కాటన్, సిల్క్, పట్టు, ఇతర సహజంగా ఉపలబ్ధమయ్యే నార, పీచులతో అద్భుతమైన వస్త్రాలు తయారు చేస్తారు చేనేత కళాకారులు.
2008 నుండి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా జరుపుతుంది. 2008, ఆగస్టు 7న హైదరాబాదు లోని రవీంద్రభారతిలో జరిగిన చేనేత దినోత్సవ వేడుకలకు నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి హాజరైనారు. 2012, ఏప్రిల్ 6న రవీంద్ర భారతిలో వెంకన్న సారధ్యంలో చేనేత దినోత్సవ చరిత్ర, ఆవశ్యకతను వివరిస్తూ స్వదేశీయం సంగీత నృత్య రూపకం ప్రదర్శించారు. 2012, ఆగస్టు 7న దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట నుండి రాజ్ ఘాట్ వరకు చేనేత వాక్ చేసి జాతీయ స్థాయిలో ఈ దినోత్సవంపై ఆసక్తిని కలిగించారు. 2014లో అదే రాజ్ ఘాట్ లో చేనేత దినోత్సవ ర్యాలీకి ముఖ్య అతిథిగా వచ్చిన అప్పటి కేంద్ర జౌళీ శాఖ మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్ ప్రధానితో చర్చించి చేనేత దినోత్సవాన్ని అధికారికం చేస్తామని మాటిచ్చారు. అన్ని రాష్ట్ర ప్రభుత్వాల, కేంద్ర ప్రాంత ప్రభుత్వాల అంగీకారంతో 2015, జూలై 29న భారత ప్రభుత్వం ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా అధికారిక గెజిట్ విడుదల చేసింది. 2015,ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని భారత ప్రధాని నరేంద్ర మోడీ చెన్నైలో అధికారికంగా ప్రారంభించారు.

చేనేత పరిశ్రమ నేడు కుంటుపడింది. అనేక లోటుపాట్ల కారణంగా చేనేత కుటుంబాలకి గిట్టుబాటు ధర లభించడం లేదు. ముడి సరుకు అందుబాటులో లేకపోవడం %-% దారం, నూలు, చెట్ల పూల రంగులుబీ కొనుగోలు చేయడానికి ఎంతో దూరాలు వెళ్ళాల్సిరావడంబీ ముడి సరుకు ధరలు పెరుగుదల- కాటన్/నూలు, సిల్క్, జనప ధరలు పెరగడంబీ ఎరువులు పురుగు మందులు, రసాయనాల ధరలు పెరగడం వల్ల కాటన్ ధరలు విపరీతంగా పెరిగాయి. చేనేత రంగంలో మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు లేకపోవడంబీ ఎన్నో ప్రాంతాల్లో పరిశ్రమ కనీసావ సరాలైన స్థలం, నీళ్ళు, విద్యుత్తు కూడా అందుబాటులో ఉండవు. రంగులు డిజైన్లు క్షణక్షణం మారుతుంటాయి. కొత్త డిజైన్ల కొరత పరిశ్రమను దెబ్బతీస్తోంది. ఇది చేనేత కళాకారులు చేయలేక కాదు, డబ్బు పెట్టేవాళ్ళు %-%రిస్క్' లేకుండా వ్యాపారం చేయాలను కోవడం కారణం.



మార్కెట్ల వ్యవస్థ సదుపాయాలు లేకపోవడం. చేనేత పరిశ్రమ ఉత్పత్తులకు %-%పేటెంట్' లేకపోవడం వల్ల రక్షణ లేదు, అన్ని సంప్రదాయ డిజైన్లు అనుకరించి నకళ్ళు చేస్తున్నారు. చేనేత సహకార సంస్థలు రాజకీయ జోక్యం వల్ల, అవినీతి వల్ల నష్టాల పాలయాయి. కేంద్ర రాష్ట్ర బడ్జెట్లలలో సరైన నిధుల కేటాయింపులు లేకపోవడం, చేనేత డిజైన్లు నకలు/ కాపీ చేసి, పవర్లూమ్లులు అవే చేనేత అని చెప్పుకుని చెలామణి అయిపోతున్నాయి. తెలంగాణలో చేనేత రంగంలోని 40 వేల కుటుంబాలకు సంక్షేమ కార్యక్రమాలు అమల వుతున్నాయి. పోచంపల్లి, ఆలేరు, కనుకుల, శాయంపేట, కమలా పూర్, ఆర్మూర్, వెల్టూర్, వేములవాడలో బ్లాక్ లెవల్ క్లస్టర్లు ఏర్పాటు అయ్యాయి. పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కు అభివృద్ధికి రూ.15 కోట్లు కేటాయించారు.

లాక్ డౌన్ మరింత ప్రమాదంలోకి తోసింది. చేనేత, మరనేత రంగాలు ఇప్పుడు ఇదే ఇబ్బందుల్లో ఉన్నాయి. లాక్ డౌన్ వల్ల బట్టల వ్యాపారం పూర్తిగా ఆగిపోయింది. దీని ప్రభావం నేత కార్మికులపై తీవ్రంగా ఉంది.

ప్రస్తుతం నేత కార్మికులుగా... ఒకరు చేతితో మగ్గంపై నేతనేసే వారు, చేనేత కార్మికులు. రెండోవారు, కరెంటు మెషీన్ల మీద నేతనేసేవారు మరనేత కార్మికులు. లాక్ డౌన్ ఇప్పుడు ఇద్దర్నీ ఇబ్బంది పెడుతోంది. ప్రభుత్వాలు చేనేత రంగానికి తగు ప్రోత్సాహం అందించడంతో పాటు, ప్రతి భారతీయుడు, తాము కొనే వస్త్రాలలో, దుప్పట్లు, తువాళ్ళు, కర్టెన్లు మొదలైన నిత్యం వాడే వస్తువుల్లో, కనీసం 15-20% చేనేత తయారీలు వాడగలిగితే, మన ప్రాచీన సాంస్కృతిక సంపద, వారసత్వం మన గలుగుతుంది. చేనేత మీద ఆధారపడ్డ లక్షలాది కుటుంబాలు మనుగడ సాగించగలుగుతాయి.




ఎస్ కే ఎన్ ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ మరియు సైన్స్ కళాశాల, జగిత్యాలలో తెలంగాణా సిద్ధాంత కర్త ప్రో. జయశంకర్ జయంతి

జగిత్యాల ఆగస్ట్ 06 (ప్రజామంటలు): స్థానిక ఎస్ కే ఎన్ ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ మరియు సైన్స్ కళాశాలలో మంగళవారం తెలంగాణా సిద్ధాంత కర్త ప్రో. జయశంకర్ జయంతిని కళాశాల విద్యా శాఖా మరియు జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ప్రో. జయశంకర్ విగ్రహానికి మరియు ఫొటోకు హారం వేసి నివాళులు అర్పించడం జరిగినది. ఈ కార్యక్రమములో కళాశాల ప్రిన్సిపాల్ ప్రో.అరిగేల అశోక్ అధ్యాపకులు పీ.రాజు, సాయి మధుకర్, ఎ. గోవర్ధన్ కే. శ్రీనివాస్, లైబ్రేరియన్ కే. సురేందర్ , అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతముగా నిర్వహించారు.

## ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా నివాళులర్పించిన గౌరవ వర్ధన్నపేట ఎమ్మెల్యే



హనుమకొండ ఆగస్ట్ 06 (ప్రజామంటలు): నేడు హనుమకొండ ఏకశిలా పార్కు లోని ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి తెలంగాణ నిర్మాణానికి కృషిచేసిన ఆయన సేవలను స్మరించుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు. ఈ కార్యక్రమంలో శాసనమండలి వైస్ చైర్మన్ బండా ప్రకాష్ గారు మరియు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు వివిధ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## గత పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకోని 'నరహరి తండా'

### సమస్యలు పరిష్కరించాలని మంత్రి ప్రభాకర్ కు తండా వాసుల వినతి పత్రం

భీమదేవరపల్లి ఆగస్ట్ 06 (ప్రజామంటలు): మండలంలోని ముల్కనూరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న నరహరి తండాకు సమస్యలు వేధిస్తున్నాయి. తండా ప్రజల సమస్యలు పరిష్కరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు రాజేష్ నాయక్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి నిధులు కేటాయించకుండా, దీనమైన పరిస్థితిలో నరహరి తండా వాసులు కాలం వెల్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా ముల్కనూర్ హై స్కూల్ నుండి మొదలుకొని నరహరి తండా వరకు ఎలాంటి రోడ్డు సౌకర్యం లేదని, కనీసం ఆటోలు, బైకులు రావాలన్నా ఇబ్బందికరమైన పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. రాత్రి సమయాల్లో అత్యవసరంగా హాస్పిటల్ కి



రావాలంటే ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకోవాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన మంత్రి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని అన్నారు. వినతి పత్రం అందించిన తండావాసులు లావుడ్యా రాజేందర్ నాయక్, సతీష్, లావుద్య సంతోష్, మాలోతు అరుణ్, మాలోతు రాజన్న, మాలోతు రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ డి ఐ ఈ ఓ గా కోటగిరి వెంకటేశ్వర్లు



జగిత్యాల ఆగస్ట్ 6 (ప్రజా మంటలు) జగిత్యాల జిల్లా ఇంటర్మీడియట్ డి ఐ ఈ ఓ గా కోటగిరి వెంకటేశ్వర్లును నియమిస్తున్నట్లు ఇంటర్ బోర్డ్ ఒక ప్రకటనలో పేర్కొంది. వెంకటేశ్వర్లు ఇప్పటివరకు కొడిమ్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ గా పని చేస్తున్నారు. ఇంతవరకు నోడల్ అధికారిగా నారాయణ వ్యవహరించారు.

## వీరభద్ర నక్షత్ర మాల దీక్ష తీసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్

వ్యాప్తంగా ప్రజల సమస్యల పరిష్కారానికి, తన వంతు కృషి చేస్తూ, తన పనిలో ఆ భగవంతుడు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నాను అని అన్నారు.
ప్రతి ఒక్కరూ దైవచింతను అలవర్చుకొని, మానసిక ప్రశాంతతను పొందాలని అన్నారు. మంగళవారం కొత్తకొండ వీరభద్రుని సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



**దేవుడి మహిమ మీద విశ్వాసం ఉంది..**
**- మంత్రి పొన్నం ప్రభాకర్**

భక్తుల ఆకాంక్షలకు, విశ్వాసాలకు అనుగుణంగా, ఈ దీక్ష నా ఒక్కడి మంచి కొరకే కాకుండా, సర్వేజనా సుఖినోభవంతు స్ఫూర్తితో రైతులు వ్యవసాయం, ప్రతి ఒక్కరూ పాడి పంటలతో సస్యశ్యామలంగా, బాగుండాలని ఈ దీక్ష తీసుకోవడం జరిగిందని అన్నారు. ఈ నియోజకవర్గానికి సంబంధించిన అన్ని సమస్యలు పరిష్కారం అయ్యేలా, వీరభద్రుడు ధైర్యాన్ని, మనో బలాన్ని ఇవ్వాలని కోర మీసాల స్వామిని వేడుకున్నట్లు తెలిపారు.

**నక్షత్ర దీక్ష తీసుకున్న స్వాములకు నిత్య అన్నదాన కార్యక్రమం**

రవాణా, బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ నక్షత్ర దీక్ష మాలను తీసుకొని మూడు రోజులపాటు వీరభద్ర స్వామి దేవాలయం వద్దనే ఉంటూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. నక్షత్ర దీక్ష స్వాములకు అల్పాహారము, అన్నదాన కార్యక్రమం 27 రోజులపాటు పొన్నం సతీమణి పొన్నం మంజుల నిర్వహించుచున్నారు.

**27 రోజుల దీక్ష**

వీరభద్ర మాల స్వీకరించిన భక్తులు 11 రోజులు లేదా 27 రోజులు మాల వేసుకుని దీక్షలో ఉంటారు. ఆగస్టు 6 నుండి సెప్టెంబర్ 2 వ, తేదీ వరకు దీక్ష ఉంటుంది. మంత్రి పొన్నంతోపాటు 100 మందికి పైగా స్వాములు మంగళవారం మాల వేసుకుని నక్షత్ర దీక్ష తీసుకున్నారు.

**కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు**

హుస్నాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల, మండలాల కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరైనారు. ఆలయ ఈవో కిషన్ రావు, మాజీ చైర్మన్ మాడిశెట్టి కుమారస్వామి, ముల్కనూర్, వేలేర్ ఎస్సైలు సాయిబాబు, సురేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిట్టంపల్లి ఐలయ్య, బొజ్జపురి అశోక్ ముఖర్జీ, కేతిరి లక్ష్మారెడ్డి, కొలుగూరి రాజు, ఊసకోయిల ప్రకాష్, ఆదరి రవీందర్, చంద్రశేఖర్ గుప్తా, మంగ రామచంద్రం, కొడకండ్ల సుదర్శన్ రెడ్డి, డబ్బా శంకర్, నరేందర్ గౌడ్, చిట్కురి అనిల్, జక్కుల అనిల్, ఊరడి జయపాల్ రెడ్డి, సత్తిరెడ్డి, కోటేశ్వర్ రెడ్డి, దేవరాజు శంకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

### మత్తుపదార్థాల నియంత్రణ పై ప్రత్యేక అవగాహన సదస్సు డీఎస్పీ రఘు చందర్

జగిత్యాల ఆగస్ట్ 06 (ప్రజామంటలు): స్థానిక ఎస్ఎస్వి డిగ్రీ కళాశాల లో ఈరోజు యాంటి నార్కోటిక్స్ బ్యూరో మరియు జగిత్యాల పట్టణ పోలీస్ వారి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా గంజాయి మరియు మత్తుపదార్థాల నియంత్రణ పై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా యాంటినార్కోటిక్స్ బ్యూరో ఏ సి పి ఎస్ .ఉపేందర్ మాట్లాడుతూ... నేటి సమాజంలో అత్యధికంగా యువత చాలా రకాల మత్తు పదార్థాలకు బానిసలు అవుతున్నారని ఈ మత్తు పదార్థాల అలవాటులో ఎక్కువ తన మిత్రుల సహకారంతోనే అలవాటు అవుతుందని అలా అలవాటు అయిన మత్తు పదార్థాల వినియోగం ద్వారా యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని కాబట్టి అలాంటివారికి దూరంగా ఉంటూ మత్తు పదార్థాలకు అలవాటు అయిన వారు మీ చుట్టుపక్కల ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్లో గాని ప్రత్యేకంగా నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో వారికి గాని నేరుగా గాని వాట్సాప్ ద్వారా గాని తెలియజేస్తే వారిలో మార్పు తీసుకొచ్చే విధంగా ఈ యాంటినార్కోటిక్స్ బ్యూరో పనిచేస్తుందని తెలియజేశారు. జగిత్యాల డిఎస్పి రఘు చందర్ ఇట్టి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.... తల్లిదండ్రులు పిల్లలపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా మత్తు పదార్థాలకు అలవాటు కాకుండా మీ ఉద్యోగ భవిష్యత్తుపై ఆలోచిస్తూ ముందుకు సాగేలా మీ ఆలోచనలు ఉండాలని తాత్కాలిక ఆనందాన్ని ఇచ్చే మత్తు పదార్థాలకు బానిస కాకుండా భవిష్యత్తు సహకారం చేసే మంచి అలవాట్లతో ముందుకు సాగాలని తెలిపారు ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి విద్యార్థితో ప్రత్యేక ప్రతిజ్ఞను చేయించి మత్తు పదార్థాల వాడకం నియంత్రణలో ప్రత్యేకంగా భాగస్వాములు కావాలని అలాంటివారు ఎక్కడ ఉన్న వెంటనే ఆంటీనార్కోటిక్స్ బ్యూరో సెల్ నెం.8712671111 వారికి లేదా సమీప పోలీస్




స్టేషన్ కు తెలియజేయాలనీ ప్రత్యేక ప్రతిజ్ఞ ద్వారా ప్రతి విద్యార్థికి తెలియజేశారు. ఈ యొక్క కార్యక్రమంలో ఆంటీనార్కోటిక్స్ బ్యూరో ఏ సి పి ఎస్.ఉపేందర్ జగిత్యాల డిఎస్పి రఘు చందర్ జగిత్యాల పట్టణ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్ నార్కోటిక్ ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి మరియు ఎస్ఎస్వి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గోపు మునిందర్ రెడ్డి ,అధ్యాపక బృందం మరియు 250 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# దళిత మహిళ పై పోలీసుల థర్డ్ డిగ్రీ..

**విచారణ పేరుతో వివస్త్ర ను చేసిన వారిని డిస్మిస్ చేయాలి**




జనగామ ఆగస్టు 06 (ప్రజామంటలు):
బంగారం దొంగతనం నెపంతో దళిత మహిళ పై పోలీసుల థర్డ్ డిగ్రీ విచారణ పేరుతో వివస్త్ర ను చేసిన పోలీసులను డిస్మిస్ చేయాలని, సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరింపచాలని కెవిపిఎస్ జిల్లా కమిటీ ఉపాధ్యక్షురాలు పల్లెర్ల లలిత అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర కెవిపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం బూడిద రాజలక్ష్మి అధ్యక్షత వహించగా లలిత పాల్గొని మాట్లాడుతు షాద్ నగర్ కు చెందిన దళిత మహిళ సునీత ఇంటి పక్కన గల నాగేందర్ అనే వ్యక్తి ఇంట్లో బంగారం దొంగిలించిందనే నెపంతో రాత్రి 8 గంటల సమయంలో పోలీస్ స్టేషన్ పట్టుకొచ్చి పిలిపించి పురుష పోలీసులు చీర విప్పి నెక్కర్ తొడిగి మరీ కర్రలతో కొట్టాడం సిగ్గుచేటు అని అన్నారు. షాద్ నగర్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ రామ్ రెడ్డితో పాటు నలుగురు పోలీసులు దొంగతనం పేరు మీద తన భర్త భీమయ్యను మొదట్లో కొట్టి వదిలేసి తన చిన్న కుమారుడు మైనర్ బాలుడు తొమ్మిదో తరగతి చదువుతున్న జగదీష్ ను సైతం కర్రలతో కొట్టాడం చాలా బాధాకరం ఒకే కుటుంబంలో భర్త భార్య కుమారుడు ముగ్గురిని వదలకుండా చితక బాధారని బాధిత దళిత మహిళను ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఒక స్త్రీగా తాను చెప్పలేని చోట కొట్టారు దెబ్బలు తట్టుకోలేక దాహం వేస్తే నీళ్లు తాగించి మరీ కొట్టారని బూటు కాళ్లతో తొక్కి బెల్ట్ లతో చితకబాధారని చెప్పారు.నేరం ఒప్పుకోవాలంటూ కన్నతల్లి ముందే కుమారుడు జగదీష్ ను చిత్రహింసలు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. బంగారం దొంగతనం జరిగిందని అనుమానితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు నిర్ధాక్షిణ్యంగా ఓ దళిత మహిళను మగ పోలీసులు చిత్రహింసలకు గురి చేశారు. నిజం ఒప్పుకోవాలని తన కన్న కొడుకు ముందే తల్లి, కొడుకులను దారుణంగా కొట్టారు. కొట్టిన దెబ్బలకు స్పృహ తప్పి మూర్చపోగా పోలీస్ స్టేషన్ ఆవరణలోని ఫిర్యాదుదారుడితో బాధితురాలి తలకు, కాళ్లకు జండ్ బామ్ వ్రాయించారు. ఫిర్యాదుదారుడి కారులోనే బాధితులను అర్ధరాత్రి ఇంటికి హుటాహుటిన తరలించారు. ప్రస్తుతం దెబ్బలు తిన్న మహిళ తీవ్ర అస్వస్థతతో ప్రభుత్వ హాస్పిటల్ లో చికిత్స పొందుతుంది షాద్ నగర్ పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన సునీత భీమయ్య దంపతులను పోలీసులు ఓ దొంగతనం ఆరోపణలపై అదుపులోకి తీసుకున్నారు. పక్కింట్లో నివాసముంటున్న నాగేందర్ అనే వ్యక్తి వీరిపై గత నెల 24వ తేదీన షాద్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తమ ఇంట్లో బంగారం దొంగతనం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ రామ్ రెడ్డి మరో నలుగురు పోలీసు సిబ్బంది రఫీ, మోహన్ లాల్, కరుణాకర్, అఖిల, అనే మొత్తం ఐదు మంది పోలీసులు సునీత భీమయ్య దంపతులను మొదట అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత భర్త భీమయ్యను వదిలేసిన పోలీసులు కుమారుడు 13 ఏళ్ల జగదీష్ తొమ్మిదవ తరగతి చదువుతున్నాడు. తల్లి కొడుకులను అదుపులోకి తీసుకొని పోలీసులు తమదైన శైలిలో ఇంటరాగేషన్ చేశారు. డిఐ రాంరెడ్డి సునీతను చిత్రహింసలకు గురి చేసినట్టు బాధితురాలు పేర్కొంది పోలీస్ స్టేషన్లకు తీసుకువచ్చిన రాత్రి తనను బట్టలు విప్పించి కాళ్ల మధ్యన కర్రలు పెట్టి బూటు కాళ్లతో తొక్కుతూ చీర విప్పించి చెడ్డి తొడిగించి మరి కన్న కొడుకు జగదీష్ ముందే చితకబాదారు. దొంగతనం ఒప్పుకోకపోవడంతో ఆమె కొడుకు అయిన జగదీశ్వర్ ను కూడా అరికాళ్ళపై లబ్బర్ బెల్ట్ తో కొట్టినట్టు బాధితులు పేర్కొన్నారు. కొడుతున్న దెబ్బలకు తాళలేక పోయానని బాధిత మహిళ పేర్కొన్నట్లు చెప్పారు. దళిత మహిళ సునీత పై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన సంఘటనపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలి. థర్డ్ డిగ్రీ ప్రయోగించిన డిఐ రామ్ రెడ్డి మరో నలుగురు కానిస్టేబుళ్లను తక్షణమే డిస్మిస్ చేయాలి. వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ఆ కుటుంబానికి ఎక్స్ గ్రేషియో అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి. ఏకలక్ష్మి, నాగిళ్ల పద్మ, కాసోజు ఉపేంద్ర, చిటుకూరు మల్లమ్మ, టేకుల ధనలక్ష్మి, లక్ష్మి, తాళ్లపల్లి సప్న, తాళ్లపల్లి రజిని పాల్గొన్నారు.

## బాలవికాస ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు





ఎల్కతుర్తి ఆగస్ట్ 06 (ప్రజామంటలు):
ఎల్కతుర్తి మండల కేంద్రంలోని బాలవికాస జన వికాస ద్వారా లక్ష్మీనరసింహ ఆస్పటల్ నుండి ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఆడవారికి ప్రత్యేకంగా చెకప్ చేయడానికి డాక్టర్ తాజ్ చూడడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎల్కతుర్తి మండల ఎస్సై గోదారి రాజుకుమార్ రావడం జరిగింది. ఆయన మాట్లాడుతూ.... బాల వికాస వారు ఏ కార్యక్రమం చేసిన అభినందనీయంగా ఉంటాయి. ప్రజలకి ఎన్నో సేవలు అందిస్తున్నారు. మీ సేవలో పాల్గొనడం నాకు ఎంతో ఆనందంగా ఉంది అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ తిరుపతి, అలాగే అంగన్వాడి టీచర్ విజయ, సిఏ లు ఆశా వర్కర్లు, గ్రామ పెద్దలు బాలవికాస కోఆర్డినేటర్, ఏ. శోభ, జే. రూప, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## భర్తీ పూర్ గ్రామంలో తల్లిపాల వార్షికోత్సవం



ఇబ్రహీంపట్నం ఆగస్ట్ 06 (ప్రజామంటలు):
ఇబ్రహీంపట్నం మండలంలోని భర్తీ పూర్ గ్రామంలో లోని అంగన్వాడి కేంద్రంలో శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంగన్వాడి ఉపాధ్యాయులు మంగళవారము తల్లిపాల వార్షికోత్సవములు ఘనంగా నిర్వహించడం జరిగింది , ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ప్రతిభ మాట్లాడుతూ.... గర్భిణీలకు బాలింతలకు తల్లిపాలు ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడం జరిగినది. 9 నెలలు పడిన గర్భిణి డెలివరీ అవ్వగానే ఒక గంట తర్వాత తల్లిపాలు పట్టించాలని చెప్పడం జరిగింది. పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే తాగించాలి ముర్రు పాలు తాగించడం ద్వారా బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది మరియు మానసికంగా శరీరకంగా ఎదుగుదల జరుగుతుంది. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం కాబట్టి దాన్ని దృష్టిలో ఉంచుకొని బాలింతలు తమ పిల్లలకు తల్లిపాలు ఇవ్వాలని అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం మౌనిక, అంగన్వాడి ఉపాధ్యాయులు సమీం సుల్తాన, ఆయా కర్కి, అరుణ, ఆశ కార్యకర్త మీర్జాహన్ బేగం, గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

# కోతులనడమ గ్రామంలో స్వచ్ఛదనం-పచ్ఛదనం కార్యక్రమం

**ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి :ఎర్రోళ్ల చైతన్య**



ఎల్కతుర్తి ఆగస్ట్ 06 (ప్రజామంటలు):
ఎల్కతుర్తి మండలం కోతులనడమ గ్రామంలో స్వచ్ఛదనం పచ్ఛదనం కార్యక్రమం. గ్రామపంచాయతీ వద్ద మొక్కలు నాటి వాటి మీద అవగాహన కల్పించడం అయినది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం పచ్ఛదనం కార్యక్రమం స్థానిక కోతులనడుమ గ్రామంలో నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం కార్యదర్శి ఎర్రోళ్ల చైతన్య మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరు విధిగా ఒక మొక్క నాటితే అదే వృక్షమై ఫలాలతో పాటు మనకు వాతావరణ సమతుల్యతకి దోహదపడుతుందని తెలియజేశారు, స్వచ్ఛదనం పచ్ఛదనం అనే కార్యక్రమం తెలంగాణ రాష్ట్రంలో రోజురోజుకు పెరుగుతున్న వాతావరణ సమతుల్యతను కాపాడాలంటే చెట్లు నాటడం మానవ మనుగడకు చాలా ముఖ్యమని తెలియజేశారు అదేవిధంగా ఫ్యాక్టరీల నుండి నిలబడే విష వాయువులను వాహనాల నుండి వెలుపడే చెడు వాయువులను ఒక్క చెట్టు మాత్రమే తీసుకొని మనకు ఆక్సిజన్ అందజేస్తాయి. అందుకని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి మానవ మనుగడకు దోహదపడాలని తెలియజేశారు. మంగళవారం తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే స్వచ్ఛదనం-పచ్ఛదనం కార్యక్రమం కోతులనడుమ గ్రామ పంచాయతీలో నిర్వహించడం జరిగింది. స్వచ్ఛదనం పచ్ఛదనం కార్య క్రమం లో భాగంగా గ్రామాల్లో చెత్తను తొలగించి,మొక్కలు నాటాలని, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని, త్రాగునీరు కలుషితం కాకుండా,మురుగు నీరు నిల్వలు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు.వ్యక్తిగత పరిశుభ్రత, ప్లాస్టిక్ వాడకంతో వచ్చే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. ప్రజా ప్రతినిధులతో పాటు, యువజన స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. వన మహోత్సవం ద్వారా ఖాళీ స్థలంలో మొక్కలు నాటగలరు అని తెలిపారు. మలేరియా డెంగ్యూ జ్వరాల మీద ప్రజలకు తగు సూచనలు ఇవ్వడం అయినది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి, మాజీ మండల అధ్యక్షులు సంతాజి, మాజీ సింగిల్ విండో చైర్మన్ గోలి రాజేశ్వరరావు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం నాయకులు ఎర్రోళ్ల చైతన్య, సురేష్ ఎంపీడీఓ విజయ్ కుమార్, మిషన్ భగీరథ ఏఇ సుభాష్, ఏంఈఓ ఉమా స్పెషల్ ఆఫీసర్ సారంగపాణి, గ్రామ కార్యదర్శి లావణ్య, ఆశావర్కర్ అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యం

**మొగిలిపేటలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు**

మల్లాపూర్ ఆగస్ట్ 06 (ప్రజామంటలు):
మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట గ్రామంలోని గ్రామపంచాయతీ ఆవరణలో ఐసిడియస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా మల్లాపూర్ ఐసిడియస్ బాధ్యురాలు శంకరమ్మ మాట్లాడుతూ.... తల్లిపాల యొక్క ప్రయోజనం ను తెలిపారు. ఈ కార్యక్రమంతో పాటుగా తల్లులకు శ్రీమంతం, బిడ్డలకు అన్నప్రాసన జరిపి , పోషకాహారం అందజేసారు. ఈ కార్యక్రమంలో ఐసిడియస్ మల్లాపూర్ సెక్టార్ సూపర్ వైజర్ శంకరమ్మ, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, ఏఎన్ఎం కవిత, అంగన్ వాడీ కార్యకర్తలు శ్యామల , పుష్ప, మధీన , ఆశా కార్యకర్తలు లలిత, ప్రేమలత, విజయ తల్లులు జరుపుల అనిత , షెహనాజ్, కారోబార్ గోల్కొండ పవన్ కుమార్ పాల్గొన్నారు.

**ఉద్యమకారులకు దిక్సూచి ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ సార్**

## తెలంగాణకు ఆయన సేవలు చిరస్మరణీయం

**జేఏసీ నాయకులు కవ్వ లక్ష్మారెడ్డి, డ్యాగల సారయ్య**



భీమదేవరపల్లి ఆగస్ట్ 06 (ప్రజామంటలు):
తెలంగాణ జాతిపిత, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత, ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 88 వ, జయంతి వేడుకలు మంగళవారం ముల్కనూర్ ప్రజా గ్రంధాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు కవ్వ లక్ష్మారెడ్డి, డ్యాగల సారయ్య మాట్లాడుతూ%ొ%. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయిన వ్యక్తి అని, తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర మరువలేనిదని అన్నారు. తెలంగాణ భావజాల వ్యాప్తికి జీవితాంతం కృషిచేసిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ సేవలను భవిష్యత్ తరాలు గుర్తుంచుకునే విధంగా అందరి హృదయాలలో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డా. ఏదులాపురం తిరుపతి, మాజీ సర్పంచ్ మాడుగుల కొమురయ్య, బొజ్జపురి అశోక్ ముఖర్జీ, కొలుగూరి రాజు, చిట్టంపల్లి ఐలయ్య, రాజు, సదానందం తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణ సంఘము ఆధ్వర్యంలో ఇందుర్తి లో ఘనంగా ప్రో. జయశంకర్ సార్ జయంతి వేడుకలు



చిగురుమామిడి ఆగస్ట్ 06 (ప్రజామంటలు):
తెలంగాణ రాష్ట్రము కోసం అనునిత్యం పరితపించి, మన ప్రాంతనికి జరుగుతున్న అన్యాయాన్ని ఎలుగెత్తిచాటి, మలిదశ ఉద్యమానికి సిద్ధాంతకర్తగా నిలిచిన "ఆచార్య శ్రీ కొత్తపల్లి జయశంకర్ సార్" జయంతి సందర్బంగా విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ వద్ద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది.. ఈ కార్యక్రమం లో సంఘము అధ్యక్షులు చెల్పూరి విష్ణమా చారి, ప్రదాన కార్యదర్శి మంతెన సాంబమూర్తి ఉపాధ్యక్షులు శ్రీరాముల సత్తయ్య , మామిడాల సాంబమూర్తి, శ్రీరాముల మహేందర్, మంతెన కుమార్, ఉత్తమాచారి,మంతెన శ్రీనివాస్, చేల్పూరి రవీంద్రచారి, ఎన్. రమేష్, శ్రీరాముల లక్ష్మణ్ చారి, నర్సింగోజు విద్యాసాగర్,మహేంద్రచారి సంఘ సభ్యులు పాల్గొన్నారు




**జనగామ పట్టణ, జనగామ మండలానికి చెందిన 105 మందికి రూ. 33,00,000 విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంచిన జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి.**

### ప్రొఫెసర్ జయశంకర్ సేవలు చిరస్మరణీయం

# ఆయన జీవితం యువతకు ఆదర్శం

## ఘనంగా ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలు

జనగామ అగస్టు 6 (ప్రజామంటలు):



తెలంగాణ సాధనకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయులు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని, ఆయన చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, (రెవెన్యూ) రోహిత్ సింగ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ సాధనకై తొలి, మలి దశ ఉద్యమంలో ఆయన పాత్ర చాలా కీలకమని, ఆయన జీవితం యువతకు ఆదర్శంగా నిలుస్తుందని, తెలంగాణ సాధన కోసం ఆయన చేసిన కృషి ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన కన్న కలల దిశగా జిల్లా అభివృద్ధికి అధికారులందరు అహర్నిశలు కృషి చేయాలని తెలిపారు. అనంతరం వివిధ శాఖల జిల్లా అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనగామ ఆర్డిఓ కొమురయ్య, ఆయా శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలి

## జిల్లా పరిషత్ సీఈవో విద్యాలత

భీమదేవరపల్లి ఆగస్ట్ 06 (ప్రజామంటలు):



ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే "స్వచ్ఛదనం – పచ్చదనం" కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేయకుండా, విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ సీఈవో విద్యాలతా అన్నారు. మంగళవారం కొత్తపల్లి, ముల్కనూర్ గ్రామపంచాయతీలలో చేపట్టిన కార్యక్రమాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ద్వారా ప్రజలలో స్వచ్ఛత పరిశుభ్రత మొక్కల పెంపకం ప్లాస్టిక్ నిషేధం వంటి విషయాలపై అవగాహన కలుగుతుందని అన్నారు. అనంతరం ముల్కనూర్ మేజర్ గ్రామపంచాయతీ ఆవరణలో తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీరేశం, ఏపీవో కుమారస్వామి, పంచాయతి కార్యదర్శి జంగం పూర్ణచందర్, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



# "స్వచ్ఛదనం – పచ్చదనం" విజయవంతానికి ప్రజలు కృషి చేయాలి

## ముత్తారం గ్రామ స్పెషల్ ఆఫీసర్ డా. మాలతి రెడ్డి

భీమదేవరపల్లి ఆగస్ట్ 06 (ప్రజామంటలు):





రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పచ్చదనం – పరిశుభ్రత విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గ్రామ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ మాలతి రెడ్డి కోరారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామంలో మంగళవారం గ్రామస్తుల సహకారంతో గ్రామంలోని పోచమ్మ దేవాలయం ముందు ఉన్న గడ్డిని తొలగించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి డాక్టర్ మాలతి రెడ్డి మాట్లాడుతూ, ఐదు రోజులు నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పచ్చదనం పరిశుభ్రత పెంపొందించేందుకు అందరి కృషి ఉండాలని అన్నారు. మొక్కలు లేని ప్రాంతాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఊరడి జయపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సంపత్ కుమార్, దేవరాజు శంకర్, ఏనుగు కోటేశ్వర్ రెడ్డి, రేనికుంట్ల ఎదాస్, పోగుల ప్రసాద్, కాశిరెడ్డి రాంరెడ్డి, నద్దునూరి చొక్కయ్య, మోకిడి భరత్, పంచాయతీ సిబ్బంది రేనికుంట్ల ఫిలిప్, ఒల్లాల కొమురయ్య, వీరమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.



మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి గడ్డం సౌజన్య కారోబార్ గోల్కొండ పవన్ కుమార్, ఆశ వర్కర్లు అంగన్వాడీలు శ్యామల, ప్రేమలత, పుష్పలత, తోకల శివకుమార్ గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొని ఘనంగా నిర్వహించారు.

# జయశంకర్ సారు ఆశయాలను కొనసాగిద్దాం..

## గీకురు రవీందర్, తాజా మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్




చిగురుమామిడి ఆగస్ట్ 06 (ప్రజామంటలు): బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రామోజు రాజుకుమార్ ఆధ్వర్యములో చిగురుమామిడి మండల కేంద్రములో గాంధీ చౌరస్తాలో ప్రో. జయశంకర్ సారు జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు జయ శంకర్ సారు చిత్రపటానికి పూల మాలను సమర్పించి ఘనంగా నివాళు లర్పించి అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, తాజా మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్ మాట్లాడుతూ జయశంకర్ సారు జీవితాన్ని తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ధార పోశారన్నారు. తెలంగాణ తొలి దశ పోరాటములో, ఇడ్లీ సాంబార్ గో బ్యాక్ ఉద్యమములో కీలక పాత్ర పోషించారు. మలి దశ ఉద్యమములో వివిధ రాజకీయ పార్టీలను ఏకం చేస్తూ, విభిన్న రకాల సంఘాలను, కవులను కళాకారులను ఏకతాటిపై తెచ్చారన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతోనే సకల కులాలు, సబ్బండ వర్గాలు అభివృద్ధి చెందుతాయనే తాను నమ్మిన సిద్ధాంతం కోసం రాజీ లేని పోరాటం చేశారన్నారు. జయ శంకర్ సారు ఆశయ సాధన కోసం అందరు కృషిచేయలన్నారు. ఈ కార్యక్రమములోకాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిటుమల్ల రవీందర్, గునుకుల రాజేశ్వర్ రెడ్డి, విశ్వబ్రాహ్మణ నాయకులు గుగ్గిళ్ళ వేణుగోపాల్, సదాచారి, అనువోజు బాలకృష్ణమాచారి, రాంపల్లి వెంకటచారి, పోలోజు కుమారస్వామి, అనువోజు చిరంజీవి, వద్లూరి కుమారస్వామి, గొల్లపెల్లి తిరుపతి, వద్లూరి నరేష్, రంగు రాజేందర్, సాంబయ్య చారి, కందారపు మల్లేశం, బందూజు సదాచారి, అనువోజు దశరథం, గొల్లపల్లి సత్యనారాయణ, దంచోనోజు సత్యనారాయణ చారి, పోలోజు చైతన్య, వివిధ కుల సంఘాల నాయకులు చింతపూల వెంకన్న, కుతాడి కొమురయ్య, కంది నాగరాజు, మల్లం బాలయ్య, రాజయ్య, బెజ్జంకి అంజయ్య, లోకిని శ్రీనివాస్, మెరుగు చిరంజీవి, నిలిగొండ కిషన్, పెనుకుల సదానందం, లోకిని నరేష్, వెంకటయ్య, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయిలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

గొల్లపల్లి ఆగస్ట్ 06 (ప్రజామంటలు):



గొల్లపల్లి గ్రామంలో మండలస్థాయి లోప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంతరాలను తొలగించి తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహించడం ఏడు నెలల నుండి తొమ్మిది నెలల గర్భిణీ స్త్రీ వరకు ముర్రుపాల ప్రాముఖ్యత గంటలోపు తల్లిపాలు పట్టించవలెనని తల్లిపాలలు వ్యాధినిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని తల్లిపాలు దేవుడిచ్చిన వరమని తల్లిపాలు అమృతంతో సమానం. లాక్టోసను తీయని పదార్థము ఉంటుందని మొదట వచ్చే పాలు లేత పసుపు రంగులు చిక్కగా ఉంటాయని ఒక టీకా లాగా పని చేస్తుందని గర్భిణీ స్త్రీలకు వారి కుటుంబ సభ్యులకు దాని యొక్క ఈ ప్రాముఖ్యత వివరించనైనది ఆరు నెలల వరకు కేవలము తల్లిపాలు ఇవ్వవలెనని తల్లిపాలలు నీటి శాతం ఎక్కువగా ఉంటుందని కాబట్టి వేరే ఆహార పదార్థాలు ఏమి ఇవ్వరాదని ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలను కొనసాగించవలెనని తల్లి పాలు ఇవ్వడం వలన తల్లికి బిడ్డకు అనుబంధం ఏర్పడుతుందని తల్లిపాలు ఇవ్వడం వలన బిడ్డకు శ్వాసకోశ వ్యాధులు నిమోనియా, డయేరియా శిశు మరణాలు జరగకుండా కాపాడుతాయని తల్లిపాలు ఇవ్వడం వలన తల్లికి కలిగే లాభాలు రొమ్ము క్యాన్సర్ నుండి నివారించవచ్చునని అండాశైవ క్యాన్సర్ను నివారించవచ్చునని బిడ్డకు బిడ్డకు ఎడమ ఉంటుందని ఆరు నెలల దాటిన పిల్లలకు తల్లిపాలతో పాటు అనుబంధాహారము రోజు ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, కోడిగుడ్డు పెట్టవలెనని రెండు సంవత్సరాల వరకు అనుబంధాహారంతో పాటు తల్లిపాలు కొనసాగించ వలెనని తల్లులకుఅవగాహన కలిగించడమైనది. ఇంటింటికి బుక్ ద్వారా గృహ సందర్శనలు చేసి ఏడు నెలల నుండి 9 నెలల గర్భిని ఆరు నెలల లోపు బాలింతలు రెండు సంవత్సరాల లోపు పిల్లల ఇండ్లను సందర్శించి వారు తీసుకోవలసిన జాగ్రత్తలు ఆహారపు అలవాట్లు ఆహారము ఆహారంలో ఆకుకూరలు కూరగాయలు పండ్లు పాలు బుద్ధి చిరుధాన్యాలు గింజ ధాన్యాలు తీసుకొనవలనని కన్నులకు అవగాహన కలిగించనైనది ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలు ఆరు నెలలు దాటిన పిల్లలకు అన్నప్రసన్న కార్యక్రమాలు మండల ప్రత్యేక అధికారి. ఆధ్వర్యంలో నిర్వహించి దాని యొక్క ప్రాముఖ్యతను తల్లులకు వివరించడం స్వచ్ఛతనం పచ్చదనం పరిసరాల పరిశుభ్రత దోమల నివారణ గూర్చి తల్లులకు మండల పరిషత్ ప్రత్యేక అధికారి సాయి బాబా డిస్టిక్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అవగాహన కలిగించనైనది ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక అధికారి సాయిబాబా, మండల వైద్యాధికారి నరేష్, అంగన్వాడి సూపర్వైజర్స్ మమత, జ్యోతి, ఏఎన్ఎం రజిత, అంగన్వాడి టీచర్స్ ఉమారాణి, సరోజ, అనంతలక్ష్మి, హరిప్రియ, విజయ, జమున ఇబ్రహీ%శీ% నగర్ రమాదేవి, ప్రణీత, శ్యామలత, రాధ గర్భవతులు బాలింతలు తల్లులు పిల్లలు పాల్గొన్నారు.



# ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడికి ఘన సన్మానం

మల్లాపూర్ ఆగస్ట్ 06 (ప్రజామంటలు):

మండల కేంద్రంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఇటీవల ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన మెట్‌పల్లి పట్టణ వాస్తవ్యుడు మైలారపు లింబాద్రిని మల్లాపూర్ మండల ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు మైలారపు లింబాద్రి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో భవన నిర్మాణానికి స్థలం తీసుకుని జిల్లా ఆర్యవైశ్య మహాసభ సంఘ భవనాన్ని నిర్మించేందుకు జగిత్యాల జిల్లాలోని అన్ని మండలాల ఆర్యవైశ్య మహాసభ సంఘాలకు అనువుగా ఉండేటట్టు సాయశక్తుల కృషి చేస్తానన్నారు. పేద ఆర్యవైశ్యుల కోసం అనునిత్యం అండగా నిలబడతానని హామీ ఇచ్చారు. అనంతరం మండల ఆర్యవైశ్య మహాసభ కోశాధికారి మేడి శివ సతీమణి మేడిశృతికి నిర్మల్ జిల్లా ముతోల్ గురుకుల పాఠశాలలో లైబ్రేరియన్ గా ప్రభుత్వ ఉద్యోగం సాధించగా ఆమెను ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు మైలారం లింబాద్రి పుష్పగుచ్ఛానంద చేసి శాలువాతో సన్మానించారు. తెలంగాణ ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా నిధులు కేటాయిస్తే అన్ని మండలాలకు సమానంగా వచ్చేలా చూస్తానని మైరావపల్లి మాద్రి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడు చౌడారపు శ్రీనివాస్, శివ శ్రీనివాస్ గుప్తా, చౌడారపు పాపయ్య, సంఘం శ్రీనివాస్, అక్షింతల లక్ష్మీనారాయణ, సోమ గోపికృష్ణ, నూనె శ్రీనివాస్, గాదే మనోహర్, నూనె శ్రీనివాస్, నూనె మధుసూదన్, పల్లికొండ శ్రీనివాస్, మైలారపు నాగభూషణం, కంటాల శ్రీనివాస్, సోమ అశ్విన్ కుమార్, మైలారపు నరేష్, పాలకుర్తి రాము, నూనె అంజనేయులుతో పాటు మండల ఆర్యవైశ్య మహాసభ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# పార్టీలకు అతీతంగా జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

## తొలి పూర్వ జెడ్పి చైర్ పర్సన్ దావ వసంత - బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు విద్యాసాగర్ రావు

జగిత్యాల ఆగస్ట్ 06 (ప్రజామంటలు):
పార్టీలకు అతీతంగా జర్నలిస్ట్ ల సమస్యలు పరిష్కరించాలి జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక తహసిల్ చౌరస్తా వద్ద జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం చేస్తున్న నిరసన దీక్షకు బిఆర్ఎస్ పార్టీ పక్షాన సంఘీబావం ప్రకటించిన జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ,జిల్లా పరిషత్ తొలి చైర్ పర్సన్ దావ వసంతసురేష్, రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపు రెడ్డి.

ఈ సందర్భంగా విద్యాసాగర్ రావు మాట్లాడుతూ....
తాను ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన కోరుట్ల నియోజకవర్గంలో తన వంతుగా ప్రతి మండలంలో ఇళ్ల స్థలాలు కేటాయిస్తే ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాయని పేర్కొన్నారు. గతంలోనే అప్పటి తమ పార్టీ ప్రజాప్రతినిధులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సూచించామని, జగిత్యాల పాత్రికేయులకు ధరూర్ క్యాంప్ లోనే ఇవ్వాలని స్పష్టం చేశామన్నారు. అప్పటి మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ లకు సైతం ఇళ్ల స్థలాల అంశం దృష్టిలో ఉంచామన్నారు. సీనియర్ నాయకులు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కి సైతం ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నామని, జగిత్యాల జర్నలిస్ట్ లకు ధరూర్ క్యాంప్ లోనే అవకాశం ఇవ్వాలనే డిమాండ్ ను పార్టీలకు అతీతంగా వచ్చి విజ్ఞప్తి చేస్తామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పార్టీలకు అతీతంగా జర్నలిస్ట్ ల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

దావ వసంతసురేష్ మాట్లాడుతూ....
కోరుట్ల శాసనసభ్యులు అడగకముందే అక్కడి ప్రాంత జర్నలిస్ట్ లకు ఇళ్ల నిర్మాణం చేయించి ఇచ్చారన్నారు. మీడియా అనేది ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభం అని,ప్రజాహితం కోరే మీడియపై కక్ష్య పూరిత వైఖరి సరికాదన్నారు.నీడ కోసం గోడు వెళ్ళబోసుకుంటే కాలయాపన చేస్తూ,నోటి కాడి బుక్కను ఎత్త గొట్టే ప్రయత్నం చేశారని,అది ఎవరో మీడియా సోదరులే ఆలోచించుకోవాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్ట్ లు, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ప్రధాన భూమిక పోషించిన విలేకరులు నేడు రోడ్డుపై కూర్చోవడం విచారకరం అన్నారు.

లోక బాపురెడ్డి మాట్లాడుతూ....
జర్నలిస్ట్ లు చేసే పోరాటంలో న్యాయం ఉందన్నారు. ప్రజలకు,ప్రభుత్వంకు వారధిగా ఉండే జర్నలిస్ట్ లకు ముప్పై ఏళ్లుగా ఇళ్ల స్థలాలు రాకపోవడము విచారకరం అన్నారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం ఆలోచన చెసీ జర్నలిస్ట్ లకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాయికల్ మండల మహిళా అధ్యక్షురాలు స్పందన,రాయికల్ పట్టణ అధ్యక్షుడు అనిల్, కౌన్సిలర్లు శివకేసరి బాబు,శ్రీధర్ రెడ్డి,కన్నాక మహేందర్, మహేష్ ఏఎంసి మాజీ ఛైర్మన్ నాగేశ్వర్ రావు, వైస్ ఛైర్మన్లు ఆసిఫ్,బర్కం మల్లేష్, రాయికల్ మండల ఉపాధ్యక్షుడు సాగర్ రావు, మాజీ సర్పంచ్ బుర్ర ప్రవీణ్ గౌడ్, గంగారాం, మల్లారెడ్డి, నాయకులు శీలం ప్రవీణ్,సురేందర్ నాయక్, వెంకటేశ్వర్ రావు, పడిగెల గంగారెడ్డి, దయ్యాల మల్లారెడ్డి, తుమ్మ గంగాధర్, తాండ్ర సుధీర్, రిజ్వాన్, సదానందం, నక్క గంగాధర్, పూదరి శ్రీనివాస్, బాలే చందు, ప్రణయ్, ప్రతాప్, భగవాన్ రాజ్, మనోజ్, సన్నీ మరియు నాయకులు, బిఆర్ఎస్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.







# జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు

జగిత్యాల ఆగస్ట్ 06 (ప్రజామంటలు):
ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతిని పురస్కరించుకోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయములో ఏర్పాటు చేసిన కార్యాక్రమములో అడిషనల్ ఎస్పీ భీమ్ రావు, ప్రొ. జయశంకర్ సర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ... తెలంగాణ భావజాల వ్యాప్తి కోసం తన జీవితాన్ని అంకితం చేసి రాష్ట్ర సాధనకు మార్గం సుగమం చేసిన మహనీయుడు, తెలంగాణ స్ఫూర్తి ప్రదాత అని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సర్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం అని ఆయన ఆశయాలను కొనసాగించడమే మన%శీ% ఆయనకు ఇచ్చే ఘన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో శశికళ, ఆర్ఐ లు రామకృష్ణ, వేణు, ఆర్ఎస్ఐ డిపిఓ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# మేడిబావిలో ఉచిత మెడికల్ క్యాంప్

సికింద్రాబాద్ ఆగస్ట్ 06 (ప్రజామంటలు):
సీతాఫల్మండి కుట్టి వెల్లోడి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో మేడిబావి ఆర్య సమాజ్ ఆవరణలో మంగళవారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ప్రస్తుతం డెంగ్యూ, మలేరియా లాంటి సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు ఎస్.పీ.హెచ్.వో డా.సక్కుబాయి, డా.ప్రత్యూష తెలిపారు. వందమందికి పైగా స్థానికులకు రక్త పరీక్షలు డయాబెటిస్ బీపీ పరీక్షలు నిర్వహించి మందులను అందచేశారు. క్యాంపులో పీహెచ్ఎన్. శ్యామల, ఏఎన్ఎం ప్రసన్న, మలేరియా అధికారి శంకర్, ఆశా వర్కర్ సుమలత పాల్గొన్నారు.

# తెలంగాణ సిద్ధాంతకర్తకు ఘన నివాళులు అర్పించిన కలం వీరులు

జగిత్యాల ఆగస్ట్ 06 (ప్రజామంటలు):
తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ సార్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం ఇండ్ల స్థలాల కోసం దీక్షలు నిర్వహిస్తున్న జర్నలిస్టులు ఆచార్య జయశంకర్ చిత్రపటానికి మధ్యాహ్నం ఒంటిగంటకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.... తెలంగాణ సిద్ధాంతకర్తగా పేరుపొందిన ఆచార్య జయశంకర్ ఆగస్టు 6, 1934 వరంగల్ జిల్లా అక్కంపేటలో జన్మించారని ఆయనకు తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో మంచి ప్రావీణ్యం ఉన్నదని గుర్తు చేశారు. ఆ జన్మ బ్రహ్మచారిగా జీవితాన్ని గడిపి ఆర్థిక శాస్త్రంలో పట్టా పొందిన వ్యక్తి. ప్రిన్సిపల్ గా, వైస్ ఛాన్సలర్ గా ఉన్నత పదవులు అలంకరించారని అన్నారు. 1969 తెలంగాణ ఉద్యమంలో అంతకుముందు నాన్ ముల్కీ ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవశ్యకతపై ఎన్నో పుస్తకాలు రాసినట్లు తెలిపారు. మా వనరులు మాకు ఉన్నాయి మా వనరులపై మాకు అధికారం కావాలి. యాచక దశ నుంచి శాసక దశకు తెలంగాణ రావాలి అని నినాదించిన వ్యక్తి అని 50 ఏళ్లుగా ఇదే ఆకాంక్ష ఇదే శ్వాస ఇదే లక్ష్యం, ఇదే జీవితం, ఇందులోనే మరణం, అని ఉద్యమాన్ని శ్వాసించిన మహోపాధ్యాయుడు జయశంకర్ అని ఆయన చివరి కోరిక తెలంగాణ రాష్ట్రాన్ని చూడకుండానే కన్నుమూశాడని ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ జర్నలిస్టులు ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.





# డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను వెంటనే పంపిణీ చేయాలి

## సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి

జమ్మికుంట ఆగస్ట్ 06 (ప్రజామంటలు):
రెండు పడక గదుల ఇళ్లను వెంటనే అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. సిపిఎం జమ్మికుంట మండల కమిటీ ఆధ్వర్యంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను సందర్శించి ఆయన మాట్లాడుతూ.... అర్హులైన పేదలకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇచ్చేందుకు నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం 2015-16లో 533 ఇండ్లను మంజూరు చేయగా టెండర్లు పిలిచి అగ్రిమెంట్ చేశారని గుర్తు చేశారు. 2017లో ఆలాంటి మంత్రి ఈటల రాజేందర్ శంకుస్థాపన చేశారన్నారు. 7 సంవత్సరాలు పూర్తి అయిన అర్హులైన పేదలకు రెండు పడక గదుల ఇండ్లు అందరి ద్రాక్ష గానే ఉన్నాయన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం 169 బేస్మెంట్ లెవెల్ 100 లెంటల్ మరియు రూఫ్ లెవెల్, 112 ప్లాస్టింగ్ పూర్తయినట్టు, 152 ఇండ్లు నివాసానికి యోగ్యంగా అన్ని విధాలా పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారన్నారు. అసంపూర్తిగా ఉన్న ఇండ్లను త్వరిత గతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు అనేకసార్లు దరఖాస్తులు ఆహ్వానించారని, ఈ మేరకు అరులైన పేదలు దరఖాస్తులు సైతం చేశారని, ఇండ్లు కేటాయించడంలో అధికారులు, ప్రభుత్వాలు పూర్తి నిర్లక్ష్య పూరితంగా వ్యవహరిస్తున్నాయన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చేయకపోవడం మూలంగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని, గొర్రెలు, మేకల,పశువుల పాకలుగా మారిపోయాయ అన్నారు. మందుబాబులకు అడ్డాగా మారాయన్నారు. విలువైన సామాగ్రి ఉన్నప్పటికీ కాపలా లేకపోవడం శోచనీయమన్నారు. పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారుపట్టణంలోని వివిధ వార్డులలో సర్వే నిర్వహించి, అర్హులైన లబ్ధిదారులకు రెండు పడక గదుల ఇళ్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా, వ్యవహరిస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు అధికార యంత్రాంగం ఇప్పటికైనా కళ్లు తెరిచి పేదలందరికీ ఇండ్లు ఇప్పించాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారులు ఐక్యంగా ఉండి పోరాడితేనే రెండు పడక గదుల ఇళ్లను పంపిణీ చేస్తారని ,ఆదిశగా పట్టణంలోని లబ్ధిదారులు అందరూ ఐక్య ఉద్యమాలు నిర్వహించి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించని కేటాయించని ఎడల అర్హులైన పేదలందరితో ఇండ్లు ఆక్రమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శీలం అశోక్, నాయకులు కొప్పుల శంకర్, బాసిర సంపత్ రావు,దండిగారి సతీష్, కన్నం సదానందం, ఐలోని సంజీవరెడ్డి, రావుల ఓదెలు, హరీష్ , బాలు తదితరులు పాల్గొన్నారు.





# జనగామలో డాక్టర్ సుగుణాకర్ రాజుకు వీడ్కోలు సమావేశం

జనగామ ఆగస్ట్ 06 (ప్రజామంటలు):
జనగామ గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ ఆడిటోరియంలో జనగామ నుండి బదిలీపై తొర్రూర్ కి వెళ్లిన డాక్టర్ సుగుణాకర్ రాజుకు వీడ్కోలు కార్యక్రమం మంగళవారం ఎర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.... గత 24 సంవత్సరాలుగా జనగామ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ లో పనిచేసి అనేక రకాలైన సౌకర్యాల రూపకల్పనలో డాక్టర్ సుగుణాకర్ రాజు కృషి అభినందనీయమని అన్నారు. జనగామ జిల్లా ఆసుపత్రిగా డిస్టిక్ జనరల్ ఆస్పత్రిగా మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని, మెడికల్ కాలేజ్ , బ్లడ్ బ్యాంకు ఆధునికరించడం, తెలంగాణ డయాగ్నొస్టిక్ సెంటర్, రేడియాలజీ ల్యాబ్ ఏ ఆర్ టి సెంటర్, పిపి టిసి సెంటర్, లాబ్స్ ఫర్ లైఫ్, పాలియేటివ్ కేర్, డయాలసిస్ సెంటర్ తేవడంలో జిల్లాలో సుదీర్ఘ కాలం పని చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాలరావు, డాక్టర్ అనురాధ, సూపరిటెంట్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, సూపర్డెంట్ ప్రొఫెసర్లు నర్సింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు. బదిలీపై వెళ్లిన ఇతర డాక్టర్లకు కూడా డాక్టర్ శంకర్ డాక్టర్ చంద్రమౌళి డాక్టర్ స్వప్న డాక్టర్ స్వప్న, లింగమూర్తి మహేష్ కుమార్, విద్యావతి సిస్టర్, సిస్టర్ సెలెస్టినా, ఇందిర, విజయ రాణి, మరియమ్మ, సిస్టర్ కాజ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# సమకాలీన జీవితాలకు దర్పణం కవిత్వం

జనగామ ఆగస్ట్ 06 (ప్రజామంటలు):
సమకాలీన జీవితాలకు కవిత్వం దర్పణం పడుతుందని వరంగల్ పూర్వ మేయర్ డాక్టర్ టి. రాజేశ్వర రావు అన్నారు. జనగామ జిల్లా నర్మెట మండలం మచ్చుపహాడ్ గ్రామంలో మంగళవారం శ్రీకరాదుల వెంకటరెడ్డి ఆర్ట్స్ ఫౌండేషన్ సంస్థ అధ్వర్యంలో హనుమకొండ వాసి ప్రముఖ రచయిత్రి, గాయని శ్రీమతి అరుణ కీర్తి పతాక రచించిన బతుకు సంతకం పుస్తకం ఆవిష్కరించి ప్రసంగించారు. ఆయుర్వేద వైద్య నిపుణులు, డాక్టర్ ఎ. సమ్మి రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ.... అరుణ కీర్తి పతాక కవయిత్రి రాసిన కవిత్వం సమాజంలో అసమానతలను అద్దం పడుతుందని అన్నారు. నాన్న వెంకటరెడ్డి తాను నమ్మిన సిద్దాంతాల కోసం భావజాల వ్యాప్తి కోసం కృషి చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు.ప్రపంచ శాంతి పండుగ వ్యవస్థాపకులు, ప్రముఖ కవి మహమ్మద్ సిరాజుద్దీన్ పుస్తక సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో రాంపల్లి మల్లికార్జున రావు, అడ్వకేట్ సౌమిత్రి లక్ష్మనాచార్యులు. అతిధులుగా సంస్థ ప్రధాన కార్యదర్శి గంకిడి మల్లారెడ్డి, కవి, గాయకులు కరాదుల జనతా ప్రభంజన్ రెడ్డి, భార్గవ రామ్ రెడ్డి, కవులు కళాకారుల ఐక్యవేదిక జి. కృష్ణ, లగిశెట్టి ప్రభాకర్, అయిలా సోమనర్సింహచారి, పొట్టబత్తిని భాస్కర్, చిలుమోజు సాయికిరణ్, రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.



# బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల సమస్యలపై పార్లమెంట్ లో ఈటల ప్రస్తావన

## ఎంపీకి బీఎస్ఎన్ఎల్ నేతల కృతజ్ఞతలు

సికింద్రాబాద్ ఆగస్ట్ 06 (ప్రజామంటలు):
బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల సమస్యలను పార్లమెంట్ లో ప్రస్తావించిన మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు, బీజేపీ సీనియర్ నేత ఈటల రాజేందర్ కు బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ సంఘ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాగే ఎంపీ ఈటల రాజేందర్ తమకు అండగా ఉంటూ, తమ సమస్యలను పరిష్కారేందుకు కృషి చేయాలని బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ సంఘ నాయకులు పొట్లకాయల వెంకటేశ్వర్, ఎం. మల్లేశ్, డి. బాలకృష్ణ, పాండు, లక్ష్మన్ ఆకాంక్షించారు.



# జాతీయ కరాటే పోటీలలో గోల్డ్ మెడల్ సాధించిన కావ్య కు సన్మానం

## అంతర్జాతీయ క్రీడాకారులు అంబాల ప్రభాకర్ (ప్రభు)



జమ్మికుంట ఆగస్ట్ 06 (ప్రజామంటలు):
గ్లోబల్ చోటా కాన్ కరాటే దూ ఇండియా కరీంనగర్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కరాటే చాంపియన్ షిప్ పోటీలలో జమ్మికుంట మారుతి నగర్ కు చెందిన జన్ను రమేష్ కుమార్తె జన్ను కావ్య, జమ్మికుంటలోని సెయింట్ జోసెఫ్స్ స్కూల్ లో 9వ తరగతి చదువుకుంటూ గత 6 నెలలుగా కరాటే మాస్టర్ జాలీల్ వద్ద ప్రత్యేక శిక్షణ పొంది ఈ నెల కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన గౌరవ నారాయణ రెడ్డి మెమోరియల్ మొదటి జాతీయ స్థాయి కరాటే చాంపియన్ ఈ నెల 4 న జరుగగా ఈ పోటీలలో 15 సం. విభాగంలో కటాస్ లో అత్యుత్తమ ప్రతిభను కనబరచి బంగారు పతకం సాధించగా మంగళ వారం జమ్మికుంట కు చెందిన అంతర్జాతీయ క్రీడాకారులు అంబాల ప్రభాకర్ (ప్రభు) బంగారు పతకం కావ్య మేడలో వేసి శాలువతో సత్కరించి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఈ సందర్భంగా ప్రభు మాట్లాడుతూ.... జన్ను కావ్య కరాటే పోటీలలో బంగారం పతకం సాధించడం ఈ ప్రాంతానికే కాకుండా కరీంనగర్ జిల్లా, తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం అని అభివర్ణించారు. అదే విధంగా ప్రత్యేక శిక్షణ అందిస్తూ వందలాది మంది విద్యార్థిని, విద్యార్థులను జాతీయ అంతర్జతీయ పోటీలలో ప్రతిభ కనబరిచే విధంగా తయారు చేస్తున్న హుజురాబాద్ కరాటే మాస్టర్: జలీల్ ను ప్రత్యేకంగా శాలువతో సత్కరించి అభినందించారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ పోటీలలో బంగారు పతకాలు సాధించాలని కోరారు. యువతి యువకులు చెడు వ్యసనాలకు దూరం ఉంటూ, కరాటే, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ లలో దృష్టి సాధిస్తూ మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి దోహద పడతాయని అన్నారు. చదువుతోపాటు కరాటే స్పోర్ట్స్ అండ్ గేమ్స్ లలో పాల్గొని తమ ప్రాంతానికి గొప్ప పేరు తీసుక రావడమే కాకుండా తమ తల్లిదండ్రులు కలలు కన్న కలలను సాకారం చేయాలని కోరారు.



# ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు

### జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్నకోటి

జమ్మికుంట ఆగస్ట్ 06 (ప్రజామంటలు):
జమ్మికుంట మున్సిపల్ ఆఫీసులో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్న కోటి. మున్సిపల్ కమిషనర్ అయాజ్, కౌన్సిలర్లు బొంగుని వీరన్న, సాయిని రమ రవి, ఎలగందుల స్వరూప శ్రీహరి, దేశిని రాధా సదానందం, కుదాడి రాజన్న, మున్సిపల్ మేనేజర్ రాజిరెడ్డి, టిపిఓ శ్రీధర్, ఏఈ వరుణ్, సీనియర్ అసిస్టెంట్ వాణి, మున్సిపల్ స్టాంప్ పాల్గొన్నారు.

# జమ్మికుంట తాహసిల్దార్ ను సన్మానించిన మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్న కోటి



జమ్మికుంట ఆగస్ట్ 06 (ప్రజామంటలు):
దేశిని స్వప్న కోటి వైస్ చైర్పర్సన్ ఆధ్వర్యంలో జమ్మికుంట కు నూతనంగా వచ్చిన తాసిల్దార్ రమేష్ బాబు గారికి స్వాగతం పలుకుతూ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు సాయిని రవి గౌరవ కౌన్సిలర్లు బొంగుని వీరన్న. ఎలగందుల స్వరూప శ్రీహరి, దేశిని రాధా సదానందం, కుదాడి రాజయ్య, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వెంకటరెడ్డి చిలుముల రామస్వామి, జక్కే సంపత్ పాల్గొన్నారు.

# సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం




జమ్మికుంట ఆగస్ట్ 06 (ప్రజామంటలు):
జమ్మికుంట మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వావిలాల పరిధిలోని గంద్రపల్లి గ్రామములోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సిల్ జూనియర్ కళాశాల మరియు ధర్మారం గ్రామములో డాక్టర్ విజయకుమార్ గారి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్స్ నిర్వహిచడం జరిగినది. జూనియర్ కళాశాలలో 480 మంది స్టూడెంట్స్ కి పరీక్షలు చేసి 53 మంది స్టూడెంట్స్ కి మందులు పంపిణి చేయడం జరిగినది. ధర్మారం గ్రామములో 37 మందికి పరీక్షలు చేసి మందులు పంపించేయడం జరిగినది. ఇద్దరు జ్వరం వున్నవారికి రక్తపుతాలు సేకరించడం జరిగింది. డాక్టర్ విజయకుమార్ మరియు హెల్త్ ఎడ్యుకేటరు ఎ మోహన్ రెడ్డి ఈ సందర్బంగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా, ఫైలేరియా మొదలగు దోమల ద్వారా వచ్చే వ్యాధుల గురించి, కలుషిత నీటి ద్వారా వచ్చే డై హెరియా, జాండిస్, టైఫాయిడ్ మొదలగు వ్యాధుల లక్షణాలు తీసుకోవలసిన జాగ్రతలను క్లుప్తంగా వివరించి, అవగహన ప్రజలకు మరియు స్టూడెంట్స్ కి కల్పించిన్నారు. వ్యక్తి గత పరిశుభ్రత మరియు పరిసరాల పరిశుభ్రత గురించి మరియు చేతుల పరిశుభ్రత, రక్త హీనత గురించి స్టూడెంట్స్ కి వివరించి చెప్పినారు. కాచి చల్లార్చిన నీటి ని త్రాగాలని సూచించారు. స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం లో భాగంగా డ్రై డే కార్యక్రమం, మొక్కలు నాటడం కార్యక్రమం ను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో డాక్టర్ విజయకుమార్, హెల్త్ ఎడ్యుకేటరు మోహన్ రెడ్డి, సూపెర్వైసోర్స్ సదానందం, కుసుమకుమారి, ప్రిన్సిపాల్ ఇందిరమణి, స్పెషల్ ఆఫీసర్ రమేష్, 07 కార్యదర్శి రాము, మణెమ్మ, కవిత ఏ.ఎన్.ఎం. లు, దీపిక, సంపూర్ణ, పుష్ప లత ఆశాలు మరియు స్టూడెంట్స్ మొదలగు వారు పాల్గొన్నారు.

### హుజురాబాద్ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో

# వైద్య సిబ్బందిని వెంటనే నియమించాలి

### ఖాళీగా ఉన్న వైద్యుల నియామకాలను వెంటనే భర్తీ చేయాలి: కలెక్టర్ ను కోరిన వొడితల ప్రణవ్



జమ్మికుంట ఆగస్ట్ 06 (ప్రజామంటలు):
హుజురాబాద్ నియోజకవర్గంలోనీ అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న వైద్య సిబ్బందిని వెంటనే నియమించాలని, హాస్పటల్ కు వచ్చే రోగులకు మెరుగైన వైద్యంతో పాటు మందులు కూడా అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని కోరినట్లు హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వోడితల ప్రణవ్ ఒక ప్రకటనలో తెలిపారు. హుజురాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ దవాఖానలో రోగులకు ఏలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో దవాఖానాలకు అవసరమయ్యే నిధులను వైద్య, ఆరోగ్య శాఖ మంత్రితో మాట్లాడి తీసుకొచ్చేల కృషి చేస్తానని తెలిపారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కులతోపాటు తులం బంగారం కూడా ఇవ్వాలి

### కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి



జమ్మికుంట ఆగస్ట్ 06 (ప్రజామంటలు):
కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలలో భాగంగా వివాహం చేసుకున్న వారికి ఇస్తానన్న తులం బంగారం కూడా వెంటనే ఇవ్వాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం హుజురాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పేద కుటుంబాల పెళ్లిళ్ల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం చాలామంది జీవితాల్లో ఆసరా అయిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా కళ్యాణ లక్ష్మి పేరిట లక్ష రూపాయల తో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పినప్పటికీ ప్రభుత్వము వచ్చిన తర్వాత వేల పెళ్లిళ్లు జరిగాయని వారందరికీ తులం బంగారం ఎప్పుడు ఇస్తారు చెప్పాలన్నారు. అనంతరం కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులను అర్హులందరికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మునిసిపల్ చైర్పర్సన్ గందె రాధిక శ్రీనివాస్, మరియు కౌన్సిలర్లు అధికారులు. పి.ఏ.సి.ఎస్. చెర్మన్ కొండల్ రెడ్డి పాల్గొన్నారు.

# జర్నలిస్టు దీక్షకు సంఘీభావం తెలిపి జర్నలిస్టుల నిధికి

### 25 వేల భూరి విరాళం అందించిన మాజీ గ్రంథాలయ చైర్మన్ డా. చంద్రశేఖర్ గౌడ్



జగిత్యాల ఆగస్ట్ 06 (ప్రజామంటలు):
జిల్లా కేంద్రంలో ఆర్డీవో కార్యాలయం ఎదురుగా జర్నలిస్టులు నాలుగు రోజులుగా దీక్షలు కొనసాగిస్తుండగా మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు మాజీ గ్రంథాలయ చైర్మన్ గొల్లపల్లి చంద్రశేఖర్ గౌడ్ జర్నలిస్టులకు సంఘీభావం తెలిపి, జర్నలిస్ట్ దీక్షా శిబిరానికి విచ్చేసి 25వేల భూరి విరాళం అందించారు. ఈ సందర్భంగా మాజీ గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ.... తాను 2009 సంవత్సరంలో ప్రజారాజ్యం తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు ప్రజారాజ్యం అధ్యక్షుడు చిరంజీవికి ఇండ్ల స్థలాలు ఇప్పించాలని కోరుతూ తన ద్వారా వినతిపత్రం ఇచ్చారని అప్పటినుండి ఇప్పటివరకు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు రాకపోవడం శోచనీయమని అన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ప్రభుత్వం స్థానిక ప్రజా ప్రతినిధులు ఇళ్ల స్థలాలకు చొరవచూపి వారికి ఇండ్ల స్థలాలు వచ్చే విధంగా చొరవ చూపాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల నాయకులు జర్నలిస్టుల పక్షాన జిల్లా గ్రంథాలయ చైర్మన్ కు ధన్యవాదాలు తెలిపారు.



# బాధ్యతగా మొక్కలు నాటాలి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

రాయికల్ ఆగస్ట్ 06 (ప్రజామంటలు):
బాధ్యతగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. రాయికల్ మండలంలోస్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చెట్లు నాటారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థుల మరియు ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులకు సమయానికి బస్ సౌకర్యం కల్పించే విదంగా అధికారులకు సూచిస్తానని అన్నారు మోడల్ స్కూల్ , ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సమయానికి బస్ వచ్చేలా చేస్తానని తెలిపారు . చెట్టు నాటడమే కాకుండా వాటి సంరక్షణ కూడా చూడాలని అన్నారు ప్రతి ఒక్కరు ఒక్క చెట్టు నటాలి దాని సంరక్షణ మన బాధ్యత అని తెలిపారు. కళాశాలలోని వాటర్ ప్లాంట్ పరిశీలించారు వాటర్ ప్లాంట్ చిన్న చిన్న సమస్యలు ఉండడంతో మరమ్మతులు చేపిస్తనాని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపిరాజరెడ్డి, టౌన్ అధ్యక్షుడు మ్యాకల రమేష్, మండల అధ్యక్షులు రవీందర్ రావు, తాజా మాజీ సర్పంచ్ లు, వార్డు మెంబర్లు నాయకులు దివాకర్ రెడ్డి, తలారి రాజేష్, కొయ్యడి మహిపాల్, సాగర్ కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చిన్న పత్రికల అక్రిడేషన్ పై హైకోర్టు నిర్ణయం హర్షనీయం

### రాజకీయ విశ్లేషకులు,ప్రముఖ జర్నలిస్ట్ మహమ్మద్ అంకూస్



జమ్మికుంట ఆగస్ట్ 06 (ప్రజామంటలు):
పత్రికల్లో పనిచేసే వారికి ప్రభుత్వ గుర్తింపు అక్రిడేషన్ కార్డుల జారీలో చిన్న పత్రికలను ఎ,బి,సి,డి లుగా విభజించడం చెల్లదని హైకోర్టు తేల్చి చెప్పింది. దీనికి సంబంధించి జీవో 239 షెడ్యూలు-ఇ లోని నిబంధలను కొట్టివేసింది. అక్రిడిటేషన్‌కు సంబంధించి 2016లో జారీచేసిన జీవో లోని నిబంధనలు వివక్షా పూరితంగా ఉన్నాయని, వాటిని కొట్టివేయాలంటూ మహబూబ్‌నగర్‌కు చెందిన టి. కృష్ణ మరో ముగ్గురు 2016లో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె. శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం ఇటీవల విచారణ చేపట్టింది. పిటిష నర్ తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. ప్రభుత్వం రూపొందించిన నిబంధనల వల్ల చిన్నపత్రికల్లో పనిచేసే జిల్లా, నియోజకవర్గ స్థాయి జర్నలిస్టులకు అక్రిడిటేషన్ ప్రయోజనాలు లభించడం లేదన్నారు. వాదనలు విన్న ధర్మాసనం చిన్న పత్రికలను విభజించ డానికి ప్రభుత్వం సహేతుక కారణాలను పేర్కొనలేదని, ఆ నిబంధనలు చెల్లవని స్పష్టం చేసింది. రెండు నెలల్లో చిన్న పత్రికల జిల్లా, నియోజకవర్గ విలేకరులకు ప్రయోజనం కలిగించేలా మార్గదర్శకాలు రూపొందించాలని ఆదేశించింది. ఇలా హైకోర్టు తీర్పునీయడం పట్ల ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, ప్రముఖ జర్నలిస్ట్ మహమ్మద్ అంకుష్ హైకోర్టు తీర్పు పైన హర్షం వ్యక్తం చేశారు. సమాజంలో అందరూ సమానమే అని చిన్న పెద్ద తేడా అనేటివి ఏమీ లేవని అందరికీ ప్రశ్నించే హక్కు ఉన్నదని గుర్తించినందుకు హైకోర్టుకు ధన్యవాదాలు తెలిపారు.